PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 341 | విజయవాడ, శనివారం 12 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday12 July 2025 | Rs

బెంగాలీ మాట్లాడటమే నేరమా?

- దేశ రాజధానిలో మానవ హక్కులకు పాతర
- అమిత్ షాకు సిపిఎం నేతల లేఖ

7



సుమిత్, ప్రీతి పాల్‌కు స్వర్ణ పతకాలు

8

- 7వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

75 ఏళ్లు రాగానే తప్పుకోవాలి

రిటైర్మెంట్ వయసుపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

మోడీని ఉద్దేశించే ఆ వ్యాఖ్యలన్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : 75 ఏళ్ల వయసు రాగానే నేతలు పక్కకు తప్పుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని లేపాయి. ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నేతలు విమర్శించారు. ఈ ఏడాది సెప్టెంబరులో మోడీ 75కి ఏళ్లు నిండుతాయి.

ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేత మోరోపంత్ పింగ్లేపై రాసిన పుస్తకాన్ని ఈ నెల 9న నాగ్‌పూర్‌లో ఆవిష్కరించిన సందర్భంగా భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. పింగ్లేకు 75 ఏళ్లు నిండిన సందర్భంగా ఆయనను సత్కరించేందుకు బృందావన్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో జరిగిన ఒక సంఘటనను భగవత్ గుర్తు చేశారు. "75 ఏళ్ల వయసులో మనకు శాలువా కప్పి సత్కరిస్తున్నారంటే దానర్థం ఇక మీరు పక్కకు తప్పుకుని, ఇతరులకు అవకాశం ఇవ్వండి" అని చెప్పడమే అంటూ పింగ్లే ఆనాడు అన్న మాటలను భగవత్ గుర్తు చేశారు. ఆ భావనను దృష్టిలో వుంచుకునే పింగ్లే పనిచేశార అన్నారు.

మోడీ తనకూ 75 ఏళ్ల నిబంధన వర్తింపజేసుకోవాలి : ప్రతిపక్షాలు

ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, ఆ పార్టీ కమ్యూనికేషన్స్ విభాగానికి ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ అయిన జైరాం రమేష్ స్పందించారు. 'పాపం ప్రధాని !... విదేశాల్లో పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన వేళ... ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలను మోడీ గుర్తు చేసుకోవాలి. నాకు సరే... మీకు కూడా సెప్టెంబరు 11నాటికి 75 ఏళ్లు నిండుతాయి కదా? అని మోడీ, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌కు గుర్తు చేయాలని' అన్నారు. అదే జరిగితే "ఒక బాణానికి రెండు పిట్టలు" పడతాయంటూ రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

శివసేన (యుబిటి) రాజ్యసభ ఎంపి సంజయ్ రౌత్ మాట్లాడుతూ గతంలో ఎల్.కె.అద్వానీ, మురళీ మనోహర్‌జోషి, జస్వంత్ సింగ్ వంటి సీనియర్ బిజెపి నేతలను 75ఏళ్లు దాటగానే రిటైరవ్వాలని మోడీ ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు మోడీ తనకు కూడా అదే నిబంధనను వర్తింపజేసుకోవాలని సూచించారు.

గతంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ వ్యాఖ్యలు

రిటైర్మెంట్ వయసుపై సంఘ్ నేతలు వ్యాఖ్యానించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌గా చేసిన కె.సుదర్శన్ కూడా అద్వానీ, వాజ్‌పేయి వంటి నేతలు 75 ఏళ్ల వయసులో రిటైరై ఇతరులకు అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించారు.

సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన ఆర్‌ఎస్‌ఎస్

మోహన్ భగవత్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో వాటిని సర్దిచెప్పేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నించింది. 'రిటైర్మెంట్ వయసుపై భగవత్ ఎన్నడూ ఏమీ మాట్లాడలేదు. పింగ్లేకు సంబంధించిన ఉదాహరణ ఒకటి ఉటంకించారు అంతే. పింగ్లే హాస్య చతురత, మేథో సంపత్తి గురించి చెప్పడమే ఆ వ్యాఖ్యల ఉద్దేశం. అంతేకానీ ఎవరికీ ఆ వ్యాఖ్యలతో సంబంధం లేదు." అని సంఘ్ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు.

జనం భారం కాదు బలం!

నిర్వహణకు ఉత్తమ పాలసీ • ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తాం

జనాభా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'జనాభానే మనకు బలం... జనం ఎప్పటికి భారం కారు. దేశానికి తిరుగులేని ఆర్థిక వనరు, ఆస్తి జనాభానే' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ జనాభా దినోతవ్సం సందర్భంగా సచివాలయం వద్ద నిర్వహించిన అమరావతి సమ్మిట్‌కు ముఖ్యఅతిధిగా శుక్రవారం ఆయన హాజరయ్యారు. ' జనాభా నిర్వహణ విధానం ... ప్రతి కుటుంబం ముఖ్యం-మీ అభిప్రాయం మార్గదర్శనం' అనే కాన్సెప్ట్‌తో రూపొందించిన సర్వేను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు త్వరలో ఒక మంచి పాలసీ తీసుకొస్తామని వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జనాభాతో పాటు జననాల రేటు తగ్గిపోతోందని, యువశక్తి తగ్గిపోయి వృద్ధులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.జనాభా తగ్గిపోతే వృద్ధి రేటు పడిపోతుందని చెప్పారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని, ఇప్పుడు ఆ దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేటు పడిపోతోందని వివరించారు.




జనాభా దినోత్సం సందర్భంగా నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పిల్లలను కనేవారికి కొన్ని దేశాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయన్నారు. దేశంలో మాత్రం ఖర్చులు పెరుగుతున్నాయని పిల్లల్ని కనడం లేదని చెప్పారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, రానురాను అవి కనుమరుగవుతున్నాయని తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు పెరిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.ఉమ్మడి రాష్ట్రంలో జనాభా నియంత్రణను ఉద్యమంలా చేపట్టామని, ఇప్పుడు జనాభా నిర్వహణ అవసరమని తానే చెబుతున్నానని తెలిపారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చట్టాన్ని తెచ్చామన్నారు. ఇప్పుడు ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉన్నవారే అర్హులుగా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఒకరు ముద్దు, ఇద్దరు హద్దు, ముగ్గురు వద్దని తాను కూడా ప్రచారం చేశానని తెలిపారు. ఇప్పుడు ముగ్గురి కంటే ఎక్కువ మంది పిల్లలను కన్నవారే నిజమైన దేశభక్తులని, సమాజాన్ని కాపాడే వ్యక్తులని చెప్పారు. జనాభా పెంచేందుకు ప్రభుత్వం డబ్బులు కూడా ఖర్చు చేస్తుందన్నారు. ఒకే కుటుంబంలో ఏడుగురు పిల్లలు ఉన్నవారికి తల్లికి వందనం అమలు చేశామని తెలిపారు. అనంతరం సదస్సుకు వచ్చిన వారితో చంద్రబాబు కాసేపు మాట్లాడారు. జనాభా నిర్వహణపై కొంతమంది వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, సందేహాలకు సిఎం సమాధానాలు చెప్పారు. ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు ఎం ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్ ప్రసంగించిన ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు వందన సమర్పణ చేశారు.

సమన్వయంతో పన్నుల రాబడి

- రాష్ట్రం రోల్ మోడల్‌గా ఉండాలి
- కేంద్ర, రాష్ట్ర జిఎస్‌టి అధికారుల సమన్వయభేటీలో చంద్రబాబు

2



కరెంట్ ఛార్జీలపై కిరికిరి

- ఎఫ్‌పిపిసిఎ పేరుతో అధికంగా వసూలు
- జనం సొమ్మునే వెనక్కి ఇస్తున్నామంటూ బిల్డప్

2

కేంద్రం ఆదేశానుసారమే...

- ఎరువుల తగ్గింపుపై కూటమి సర్కార్
- రైతులను సిద్ధం చేయాలి
- కంపెనీలు, వ్యాపారుల సమావేశంలో దిశా నిర్దేశం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకే ఎరువుల వినియోగం తగ్గించాలని రాష్ట్ర రైతాంగాన్ని కోరుతున్నట్లు టిడిపి కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎరువుల వాడకం తగ్గింపుపై ఎపి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, కేంద్రం చెప్పింది కాబట్టి తగ్గించాలంటున్నామని పేర్కొంది. ఎరువుల తగ్గింపునకు వ్యవసాయశాఖతో కలిసి ఉత్పత్తి కంపెనీలు, వ్యాపారులు రైతులను సిద్ధం చేయాలని సూచించింది. ఎరువుల లభ్యత, పంపిణీపై తయారీదారులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ సంచాలకులు డిల్లీ రావు దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గాలని ఆదేశించిందన్న విషయంపైనే భేటీలో ఎక్కువగా చర్చ జరిగిందని తెలిసింది. ఎరువుల వాడకాన్ని తగ్గించడం వలన భూసారానికి, పర్యావరణానికి మేలు జరుగుతుంది. రైతులకూ ఖర్చు తగ్గుతుంది. మరోవైపు కేంద్రం భరిస్తున్న సబ్సిడీ తగ్గుతుంది. వీటిని దృష్టిలో పెట్టుకునే కేంద్రం ఎరువులను తగ్గించమని నిర్దేశించింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎరువుల తయారీకి అవసరమైన ముడి సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. సుదీర్ఘంగా కొనసాగుతున్న ఉక్రెయిన్, ఇజ్రాయిల్ యుద్ధాలు ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. మన దేశానికి అవసరమైన ముడి సరుకులో చాలా మట్టుకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఆ కారణంగా కేంద్ర ప్రభుత్వానికి సబ్సిడీ భారం పెరిగిపోతోంది. యూరియా బస్తాపై కేంద్రం రూ.1,700 వరకు సబ్సిడీ ఇస్తోంది. డిఎపి ధర పెరిగినా రూ.1,350 కే సరఫరా చేస్తోంది. ఉదాహరణకు రాష్ట్రంలోని రైతులు ఒక ఎకరాకు ఐదు బస్తాల యూరియా వేస్తున్నారు. ఈ సంవత్సరం మూడు బస్తాలకు పరిమితం కావాలి. అంటే రెండు బస్తాలు తగ్గించాలి. డిఎపిని కూడా అదే విధంగా తగ్గించాలి. గడచిన మూడేళ్ల సగటు గణాంకాల ప్రకారం ఏడాదికి 36 లక్షల టన్నుల ఎరువులు కావాలి. ఈ సంవత్సరం 32 లక్షల టన్నులకు తగ్గాలి. రమారమి నాలుగు లక్షల టన్నులు తగ్గాలి. నానో యూరియా, నానో డిఎపిలను ప్రత్యామ్నాయంగా పెద్ద ఎత్తున రాష్ట్రంలో వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టాలని కేంద్రం సూచించింది. ఏ ఎరువుతోనూ నానోను లింక్ చేసి అమ్మకూడదు. మామూలు ఎరువు స్థానంలో నానో ఎరువులను అందించాలి. కేంద్రం చెప్పినట్లు ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తుంది. తయారీదారులు, టోకు, రిటైల్ వ్యాపారులు రైతులను ఆ విధంగా చైతన్యపర్చాలి... అని డైరెక్టర్ డిల్లీరావు, ఇతర ఉన్నతాధికారులు కంపెనీలకు, వ్యాపారులకు సలహా ఇచ్చినట్లు సమాచారం.

ఆటంకాల్లేకుండా సరఫరా: డిల్లీరావు ఆదేశం

రైతులకు ఆటంకాలు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని డిల్లీరావు కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులను కోరినట్లు వ్యవసాయశాఖ మిగతా 7లో

నేటి అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసనగా శనివారం అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు.

ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) అధ్యక్షులు కె నాగభూషణ, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని, కేటగిరీల నిర్ణయంలో జరిగిన తప్పులను సరిదిద్దాలని, షరతులు లేకుండా కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల 'స్థానికత' కొనసాగించండి

సిపిఎం డిమాండ్


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాశాఖ పరిధిలో ప్రవేశ పరీక్షలకు స్థానికతను మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జి.వో. నెం. 20ని తాత్కలికంగా నిలుపుదల చేసి విద్యార్థుల స్థానికతను కొనసాగించాలని సిపిఎం డిమాండ్ చేసింది.

ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో విద్య, ఉపాధికి సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగంలో ఆర్టికల్ 371(డి) ప్రకారం మూడు రీజియన్ల వ్యవస్థ వుండేదని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. 2014 రాష్ట్ర విభజన తర్వాత మరో పది సంవత్సరాలు ఇదే స్థితిని కొనసాగిస్తూ రాష్ట్రపతి ప్రత్యేక ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. దీని కాలపరిమితి గత సంవత్సరంతో ముగియడంతో తెలంగాణ రాష్ట్రం గత ఏడాది నుండే ఆంధ్ర విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణిస్తూ ఉత్తర్వులు ఇచ్చి అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోకుండా ఈ సంవత్సరం మే 21న జిఓ ఇచ్చిందని, దాని ప్రకారం ఇంజనీరింగ్, డిగ్రీల్లో చేరేదానికి ముందు వరుసగా నాలుగేళ్లలో ఒక సంవత్సరం ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణిస్తోందని తెలిపారు. దీనివల్ల విద్యార్థుల్లో, తల్లితండ్రుల్లో తీవ్ర గందరగోళం మరియు ఆందోళన ఏర్పడిందని వివరించారు. ఏపిలో స్థానికత నిరూపించుకోవాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు 10 సంవత్సరాలు రాష్ట్రంలో నివాసం వున్నట్లు రెసిడెన్షియల్ సర్టిఫికెట్ వుండాలని, లేదా తల్లితండ్రులు ఏపిలో పది సంవత్సరాలు చదివినట్లు స్టడీసర్టిఫికేట్లు ఉండాలనే నిబంధనలు సమస్యను మరింత జఠిలం చేశాయని పేర్కొన్నారు. స్థానికతను మార్చే విషయంపై తల్లిదండ్రుల్లో, విద్యార్థుల్లో ఎలాంటి అవగాహన కలిగించకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా విద్యార్థులను ఆదుకోవాలని, అందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని కోరారు.

'రంగరాయ' ఘటనలో నలుగురు సస్పెన్షన్

నిందితులపై క్రిమినల్ కేసులు : కలెక్టర్



ప్రజాశక్తి- కాకినాడ

రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో నలుగురు నిందితులను విధుల నుంచి సస్పెండ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడలోని కలెక్టరేట్ వివేకానంద హాల్లో ఎస్‌పి జి.బిందుమాధవ్‌తో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కల్యాణ చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఈ నెల తొమ్మిదిన రంగరాయ వైద్య కళాశాలలో బిఎస్‌సి-మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు ఇ-మెయిల్ ద్వారా ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ విచారణ చేసిందన్నారు. 60 మంది విద్యార్థులను, నిందితులను కమిటీ విచారించిందని తెలిపారు. 55 మంది విద్యార్థినులు నిందితుడు కల్యాణ చక్రవర్తితో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు ఎస్.గోపాలకృష్ణ, బి.జిమ్మిరాజు, జివిఎస్.ప్రసాదరావు కూడా లైంగిక వేధింపులకు గురిచేసినట్టు వివరించారు. ఈ నివేదిక ఆధారంగా నిందితులను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సస్పెండ్ చేసి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఎస్‌పి బిందుమాధవ్ మాట్లాడుతూ నిందితులను శుక్రవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నామన్నారు. సంబంధిత సెక్షన్ల ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో రంగారాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జిజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, ఆర్‌ఎంసి పారామెడికల్ కోర్సుల కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సతీష్ పాల్గొన్నారు.



'ట్రంప్ ప్రజల శత్రువు' అంటూ వేలాదిమంది బ్రెజిలియన్లు నినదించారు. పెంచిన టారిఫ్‌లను వెనక్కి తీసుకోవాలని, తమ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని డిమాండ్ చేస్తూ.. బ్రెజిల్‌లోని సావో పాలోలో ట్రంప్ దిష్టిబొమ్మను తగలబెట్టారు. (వార్త 7లో)



యూనిలీవర్‌కు తొలిసారి మహిళా రథసారథి

- హెచ్‌యుఎల్ సిఇఒగా ప్రియా నాయర్

న్యూఢిల్లీ : దిగ్గజ ఎఫ్‌ఎంసిజి కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యుఎల్) బాధ్యతలను తొలిసారి మహిళకు అప్పగించారు. ప్రస్తుతం కంపెనీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియా నాయర్‌ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ), మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. ఆమె నియామకం ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానుందని ఆ కంపెనీ తెలిపింది. ప్రస్తుతం సిఇఒ ఉన్న రోహిత్ జావా జులై 31తో తన బాధ్యతల నుంచి వైదొలుగుతున్నారు. ప్రియా నాయర్‌కు దాదాపుగా 30 ఏళ్ల నుంచి హెచ్‌యుఎల్‌లో వివిధ హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది.

తాజా అంచనాలతో ప్యాకేజీ

- పోలవరం నిర్వాసితులకు ఒకే దశలో పునరావాసం కల్పించాలి
- ఆదివాసీల హక్కులను హరించే విధంగా మోడీ విధానాలు : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ తాజా అంచనాలతో ఒకేదశలో చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం అల్లూరి సీతారామరాజు రంపచోడవరం జిల్లా విస్తృత స్థాయి సమావేశం మండలంలోని ఎర్రంపేట గ్రామంలో శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు మేకల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నివాసాలు ఖాళీ చేసే నాటిని కటాఫ్ డేట్‌గా నిర్ణయించి, ఆ రోజుకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువతకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు సరైన పునరావాసం కల్పించే విషయంలోనూ, సర్వే చేసే విషయంలోనూ తీవ్ర జాప్యం కనిపిస్తోందన్నారు. జులై, ఆగస్టు నెలలు వస్తున్నాయంటేనే ముంపు మండలాల ప్రజలు వణికిపోతున్నారని, వరదల ధాటికి నిర్వాసితులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశలతో నిమిత్తం లేకుండా ముంపునకు గురయ్యే ప్రాంతాలన్నింటినీ ఒకే కాంటూరులోకి (45.72 మీటర్లు) తీసుకొని పరిహారం, పునరావాసం కల్పించే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మించిన పునరావాస కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చర్ వ్యాల్యూ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందన్నారు. నాలుగు మండలాల్లో ఇష్టానుసారంగా ఇంటి విలువను అంచనా వేసి నోటిఫికేషన్ ఇచ్చారని, న్యాయపరంగా కచ్చితమైన ఇంటి విలువలను తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పునరావాసాలకు తరలి వెళ్తున్న ముంపు ప్రజానీకంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి న్యాయమైన పునరావాసం, పరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలు షెడ్యూల్ ప్రాంత గిరిజనుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని తెలిపారు. గతంలో కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసినట్టే గిరిజన ప్రాంతంలో కూడా 1/70 చట్టాన్ని క్రమేపి రద్దు చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులను దోచుకునే విధంగా కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లను అమలు చేసేందుకు కుట్రపూరిత రాజకీయాలకు తెర తీస్తున్నారని, దీనిని అందరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సిపిఎం వి.శ్రీనివాసరావు

పివిటిజిల అవాసాలపై దృష్టి పెట్టాలి

ఏజెన్సీ ప్రాంతంలో పివిటిజిల పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని, రహదారులు, మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వి.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు ఏజెన్సీకి కేటాయించకుండా అభివృద్ధి నిరోధకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు.

గిరిజన గ్రామాల్లో ముఖ్యంగా పివిటిజి గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు ఎందుకు కేటాయించడం లేదో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాణిశ్రీ, పల్లపు వెంకట్, విఆర్ పురం ఎంపిపి కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

- 2013 భూ సేకరణ చట్టం కింద పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి- మునగపాక (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ 24 గంటల దీక్షను నిర్వాసితులు శుక్రవారం ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన ఈ దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు సందర్శించి మాట్లాడుతూ అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోతున్న బాధితులకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు మాట మార్చి టిడిఆర్ బాండ్లు తెరపైకి తీసుకురావడం నిర్వాసితులను దగా చేయడమే అన్నారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం కింద పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, నిర్వాసిత సంఘ కన్వీనర్ ఆర్ రాము మాట్లాడుతూ నిర్వాసితులకు నగదుతో పాటుగా ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జర్మనీ భాషలో ఉచిత శిక్షణ

- మంత్రి డోలా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నర్సింగ్, జిఎన్ఎం చదివిన ఎస్సి నిరుద్యోగ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సి యువతకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యాన ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో 150 మందికి శిక్షణ ఇచ్చి అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎస్సిలలో చదువుకున్న ఏ ఒక్కరూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సమన్వయంతో పన్నుల రాబడి

- రాష్ట్రం రోల్ మోడల్‌గా ఉండాలి
- కేంద్ర, రాష్ట్ర జిఎస్‌టి అధికారుల సమన్వయభేటీలో చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జిఎస్‌టి వసూళ్లలో ఎగవేత ఉండకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. దీనికోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. శుక్రవారం తన నివాసంలో కేంద, రాష్ట్ర జిఎస్‌టి అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసూళ్లలో దేశానికే రాష్ట్రం ఒక రోల్‌మోడల్‌గా ఉండేలా పనిచేయాలని సూచించారు. డేటా అనలిటిక్స్ ద్వారా పన్నుల వసూళ్లను ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని ముందుకు సాగాలని సూచించారు. పన్నుల వసూళ్లను సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా జాతీయ సంపదను పెంచాలని, దీనిని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని పేర్కొన్నారు. ఈ వసూళ్ల పెంపునకు కేంద్ర, రాష్ట్రాల జిఎస్‌టి అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడేలా కార్యాచరణ ఉండాలని అధికారులకు సూచించారు. వసూలవుతున్న పన్నులపై డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషణ చేయాలని నిర్దేశించారు. ఎగవేతలను అడ్డుకునేందుకు వ్యక్తులు, సంస్థలు వినియోగిస్తున్న విద్యుత్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రతి వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేయాలని చంద్రబాబు చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే రాష్ట్రం నాలుగో స్థానంలో ఉందని వివరించారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని తొలి స్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

త్వరలోనే డేటా లేక్

అన్ని శాఖల సమాచారాన్ని ఒకేచోట చేర్చేందుకు త్వరలోనే డేటా లేక్‌ను ఏర్పాటుచేసేందుకు నిర్ణయించినట్లు చంద్రబాబు చెప్పారు. దీనిని కేంద్ర జిఎస్‌టి అధికారులకు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. జిఎస్‌టి రిజిస్ట్రేషన్లలో పొరపాట్లు లేకుండా చూడాలని అన్నారు. సిఐఐ వంటి సంస్థలతో కలిసి పన్ను ఎగవేతలు లేకుండా అందరికీ అవగాహన కల్పించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అప్పటికీ ఎగవేతలు తగ్గకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రానికి రావాల్సిన వనరులు సక్రమంగా వస్తే ప్రతి చిన్న అంశానికీ కేంద్రం వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

అమరావతిలో జిఎస్‌టి జోనల్ ఆఫీస్

రాజధాని అమరావతిలో జిఎస్‌టి జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు నిర్ణయించినట్లు కేంద్ర అధికారులు చెప్పారు. అలాగే ఉద్యోగుల వసతి క్వార్టర్లను కూడా ఏర్పాటుచేస్తామని, దీనికోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే త్వరలోనే విశాఖపట్నం, విజయవాడల్లో జిఎస్‌టి ట్రిబ్యునళ్లు ఏర్పాటుచేస్తున్నట్లు రాష్ట్ర అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటివల్ల పన్నుల వివాదాలు పరిష్కారమవుతాయని వారు పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వాతావరణ ప్రభావం వల్ల ఈ ఖరీఫ్ సీజన్ కొద్దిగా ముందు ప్రారంభమైందని, రైతులకు అవసరమైన యూరియా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అందుబాటులో లేక రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్తాకు రూ.100 నుంచి రూ.150 అదనంగా చెల్లించి బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పనులు మానుకుని క్యూలో నిల్చున్న రైతులకు 5 ఎకరాలు పంట వేస్తే మూడు నుంచి నాలుగు బస్తాల యూరియాను మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. అధికారులు ప్రచారం చేస్తున్నట్లుగా లిక్విడ్ నానో యూరియా వాడకం వల్ల దిగుబడులు పెరిగే అవకాశం లేదని రైతాంగం అనుభవంలో తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛంధంగా రైతాంగం చేస్తున్న ఆందోళనలకు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. యూరియాను అవసరమైనంత అందించలేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు.

జీవ వైవిధ్య నగరంగా అమరావతి

- ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జీవ వైవిధ్యంతో రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారధి తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఓ హోటల్లో జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. సుందర అమరావతి నిర్మాణం ముఖ్యమంత్రి సంకల్పమని, దీనికోసం ఉద్యానవన ప్రముఖులతో వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని వివరించారు. రాజధానిలో 320 కిలోమీటర్ల రోడ్డు వ్యవస్థను పచ్చదనంతో హొయలొలికించే విధంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. నిర్మాణాల పక్కనే పచ్చదనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులకు తిరిగి ఇచ్చే ఎల్‌పిఎస్ జోన్లలోనూ పచ్చదనం ఏర్పాటు చేస్తామని వివరించారు. కొండవీటి, పాలవాడు ఇరువైపులా 100 నుండి 150 మీటర్ల బఫర్‌జోన్ చేస్తామన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో 22 కిలోమీటర్ల మేర బ్లూగ్రీన్ ఆలోచనలతో ముస్తాబు చేస్తామని, అందుకు తగ్గట్లు సిబ్బందిని తయారు చేస్తున్నామని వివరించారు. బయోడైవర్సిటీ నిపుణులు స్మితా హెగ్డే మాట్లాడుతూ.. మూడు నెలల్లో 68 వేల మొక్కలను నాటించామని, దీనివల్ల మంగళూరు నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గాయని తెలిపారు. అలాగే పలువురు నిపుణులూ వారి అభిప్రాయాలు వెల్లడించారు.

కందారపు మురళికి మాతృవియోగం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్



సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కందారపు మురళికి మాతృవియోగం కలిగింది. వృద్ధాప్య సమస్యలతో పాటు మెదడులో బ్లీడింగ్ కావడంతో గత వారం రోజులుగా మురళి తల్లి రాజమ్మ (82) స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కందారపు మురళి పెద్ద కుమారుడు. శనివారం మధ్యాహ్నం తిరుపతి నగరంలోని కరకంబాడి రోడ్డు గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ తల్లి కందారపు రాజమ్మ నేత్రాలను రుయా 'ఐ' బ్యాంకుకు దానం చేసినట్లు మురళి తెలియజేశారు.

విద్యుత్ ఛార్జీలపై కిరికిరి

ఎఫ్‌పిపిసిఎ పేరుతో అధికంగా వసూలు
జనం సొమ్మునే వెనక్కి ఇస్తున్నామంటూ బిల్డప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీల భారాలపై సర్కార్ కిరికిరి చేస్తోంది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) ట్రూఅప్ పేర్లతో ప్రజలపై భారాల మీద భారాలు మోపుతున్న విషయం తెలిసిందే. వసూలు చేయాల్సిన దానికంటే అధికంగా వసూలు చేస్తూ వినియోగదారుల జేబులు గుల్లచేస్తున్నాయి. ఇలా అధికంగా వసూలు చేస్తునే వినియోగదారులపై ఎలాంటి భారాలు మోపడం లేదంటూ డిస్కంలు చేసుకుంటున్న ప్రచారంపై విద్యుత్ రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2024-25 సంవత్సరంలో రూ.2787.19 కోట్లు మూడు డిస్కంలు వినియోగదారుల నుంచి వసూలు చేశాయి. ఎలాంటి అనుమతి లేకుండానే ఎఫ్‌పిపిసిఎ పేరుతో ప్రతి నెల 40 పైసలు డిస్కంలు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో రూ.449 కోట్లు అధికంగా వసూలు చేశామని, వీటిని ట్రూడౌన్ కింద వెనక్కి ఇస్తామని ప్రచారం చేసుకుంటున్నాయి. కానీ ఏడాది పాటు యూనిట్‌కు 40పైసలు చొప్పున వసూలు చేసిన అదనపు భారం గురించి డిస్కంలు ప్రస్తావించడం లేదు. ఇదిలా ఉండగా 2019-20 నుంచి 2023-24 వరకు 4వ నియంత్రణ కాలంలో డిస్కంలు ఇలానే మోసగించాయి. ఈ కాలంలో మూడు సార్లు ఎఫ్‌పిపిసిఎ చార్జీలు పెంచి వినియోగదారులపై రూ.18,751 కోట్లు భారాలు మోపాయి. ఇందులో రూ.4296 కోట్లు డిస్కంలు అధికంగా వసూలు చేశాయి. ఆయా ఏడాదిలో వసూలు చేసిన వాటిని మరుసటి ఏడాదిలో సర్దుబాటు చేయలేదు.ఎపిఇపిడిసిఎల్ రూ.1975 కోట్లు, ఎపిసిపిడిసిఎల్ రూ.2321 కోట్లు చొప్పున అదనంగా వసూలు చేశామని రెండు డిస్కంలు ఇటీవల ఎపిఇఆర్‌సికి సమర్పించిన పిటిషన్లలో పేర్కొన్నాయి. 2024-25లో రూ.3200 కోట్లు సర్దుబాటు చేశామని, మిగిలిన రూ.1096 కోట్లను ట్రూడౌన్ చేస్తామని తెలిపాయి.

ప్రభుత్వం, డిస్కంలు సర్దుబాటు పేరుతో అంకెల గారడి చేస్తూ మోసానికి పాల్పడుతున్నాయని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు నాల్గవ నియంత్రణ కాలం ప్రతిపాదనలపై ఎపిఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ విచారణలో పేర్కొన్నారు. కాబట్టి 2019 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వినియోగదార్ల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.1096 కోట్లు, 2024-25లో కూడబెట్టిన రూ.449 కోట్లు ఇప్పుడు వెనక్కి తిరిగి ఇస్తామని సర్కార్ గొప్పలు చెబుతోంది. ప్రభుత్వం తీరు చూస్తుంటే వెనకటికెవరో ప్రయాణికుడి పర్స్ కొట్టేసి, అతని టికెట్‌కు డబ్బులిచ్చి ఉదారత నటించిన వైనం గుర్తుకొస్తుంది!.


వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు రైతు ఖాతా వెంకట సుబ్బయ్య (49) రెండు ఎకరాల తన సొంత పొలంతో పాటు 13 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టితో దాదాపు రూ.12 లక్షల వరకు నష్టం వచ్చింది. పంటల పెట్టుబడి కోసం దాదాపు రూ. 14 లక్షల వరకు అప్పులు చేశారు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై శుక్రవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, చదువుకుంటున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముత్తలూరుకు చెందిన రైతు నంద్యాల భాస్కర్ రెడ్డి (48) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో 19 ఎకరాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవారు. గత రెండేళ్లుగా సాగు చేసిన వరి, మిరప పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో తీవ్రంగా నష్టం వచ్చింది. దీంతో పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 19 లక్షలకు చేరాయి. వీటిని ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురై గురువారం ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న దొడ్లవాగు సమీపంలో క్రిమిసంహారక మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య సుభద్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

కేసులకు భయపడం

- పోలీసు విచారణకు హాజరైన మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. డిజిపి హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ తీరు దారుణంగా ఉందని ఆరోపించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో ఇటీవల జగన్ పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారని అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, అంబటి రాంబాబు సోదరుడు మురళీకష్ణపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో వీరు ముగ్గురూ శుక్రవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. అనంతరం అంబటి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ జగన్ పర్యటన సందర్భంగా 113 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారని, అయినా వాటికి భయపడబోమని తెలిపారు. లోకేష్ చెప్పినట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని, లోకేష్ రాజ్యం ఎన్నాళ్లు సాగుతుందో చూస్తామని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సభలకు, సమావేశాలకు వెళ్తే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని వైసిపి నాయకులను, కార్యకర్తలను చిత్తూరు జిల్లా ఎస్‌పి మణికంఠ బెదిరిస్తున్నారని, ఆయన తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కేసుల గురించి వైసిపి శ్రేణులు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటామని తెలిపారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలేక రైతులు అల్లాడుతుంటే వారి గురించి ఆలోచించకుండా వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతానని అన్నారు.

తిరుమలలో బండి సంజయ్ విద్వేష వ్యాఖ్యలు

- హిందూయేతరులకు ఉద్యోగాలివ్వడంపై రుసరుస

ప్రజాశక్తి- తిరుమల



తిరుమల తిరుపతి దేవస్థానంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విద్వేష వ్యాఖ్యలు చేశారు. వెయ్యి మందికిపైగా హిందూయేతరులకు ఉద్యోగాలివ్వడంపై రుసరుసలాడారు. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం బయట విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. హిందూయేతరులను వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇతర మతస్తులు టిటిడిలో పనిచేస్తున్నందు వల్లే ఆచార వ్యవహారాల్లో తేడా వస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై టిటిడిపి పాలకమండలి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా దేవస్థానం బోర్డులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పునర్విభజన దిశగా పిఎసిఎస్‌లు

- జనాభా, సాగు విస్తీర్ణం ఆధారంగా కొత్తవి ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్)లను పునర్విభజన చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 26 జిల్లాల్లో 1997 పిఎసిఎస్‌లు ఉండగా, అత్యధిక జనాభా ఉండడంతో పాటు భూ విస్తీర్ణం, సాగుబడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ సరిపడినన్ని పిఎసిఎస్‌లు లేవు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రైతులకు మల్టీపర్పస్ సేవలు సక్రమంగా అందడం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మెరుగైన సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వం పెద్ద సహకార పరపతి సంఘాలను పునర్విభజన చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా రానున్న ఐదేళ్ల కాలంలో సహకార మంత్రిత్వశాఖ ఎస్‌ఒపి మార్గదర్శిక చట్టం కింద బలమైన సహకార పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రెండు లక్షల కొత్త బహుళార్థక సాధక పిఎసిఎస్, పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు లక్ష్యాన్ని నిర్ధేశించింది. నాబార్డు జారీ చేసిన మోడల్ వయబిలిటీ నిబంధనల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా పిఎసిఎస్‌లను ఏకరీతిగా, నిర్మాణాత్మక పద్ధతిలో విభజించడం, సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీని శుక్రవారం నియమించింది.

రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ నేతృత్వంలో కమిటీ

రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీ కమిషనర్ ఛైర్మన్‌గా, మెంబర్ కన్వీనరుగా ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్, మెంబర్లుగా నాబార్డు చీఫ్ జనరల్ మేనేజరు, డిసిసిబి కృష్ణ, చిత్తూరు సిఇఒలను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయి సమాచారాన్ని ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలో జనాభా ఎంతమంది ఉన్నారు? మొత్తం భూమి ఎంత ఉంది? సాగు విస్తీర్ణం ఎంత? మౌలిక వసతులు ఏ మేరకు ఉన్నాయి? పునర్విభజన చేయడం ద్వారా రైతులు ఏ మేర మేలు జరుగుతుంది? ఏయే ప్రాంతాల్లో నూతనంగా మల్టీపర్పస్ పిఎసిఎస్‌లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది? వంటి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

పాత పద్ధతే అమలు చేయాలి

- 'స్థానికత'పై మంత్రి లోకేష్‌కు ఎస్ఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యా ప్రవేశాల్లో పాత పద్ధతి ద్వారానే స్థానికతను నిర్ధారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్‌రావు, కె ప్రసన్నకుమార్ శుక్రవారం ఒక లేఖ రాశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్థానికతను పరిగణిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇంజినీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో ప్రవేశానికి ముందు నాలుగేళ్లలో ఏ ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా వారిని స్థానికేతరులుగానే పరిగణించాలని నిబంధన విధించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మే 12న ఉత్తర్వులు విడుదల చేసి ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలంటే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విద్యాసంవత్సరం వరకు పాత పద్ధతినే అమలు చేయాలని కోరారు. నూతన స్థానికత అంశాన్ని అమలు చేసే క్రమంలో విద్యార్థుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కరేడులో భూ సమీకరణ నిలిపేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కరేడు గ్రామంలో బలవంతపు భూ సమీకరణ నిలిపివేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. కరేడులో బలవంతంగా భూ సమీకరణ జరిపి, షిర్డిసాయి అనుబంధ సంస్థ ఇండోసోల్ కంపెనీకి 8,458 ఎకరాల భూమిని అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. ఉప్పరపాలెం, రామకృష్ణపాలెం, బొట్టనగుంటలో భూములు తీసుకోనున్నట్లు తెలుస్తోందని, ఈ భూముల్లో రెండు దళిత, గిరిజన గ్రామాలు సైతం కనుమరుగవుతాయని పేర్కొన్నారు. భూ సమీకరణకు ముందు గ్రామ సభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలనే నిబంధనను విస్మరించడం విచారకరమని తెలిపారు. వైసిపి హయాంలో ఇండోసోల్‌కు రామాయపట్నం పోర్టు సమీపంలో భూములివ్వాలని నిర్ణయించగా, ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అధికారం చేపట్టాక అదే సంస్థకు గతం కంటే ఎక్కువ మొత్తంలో భూములు ఇవ్వాలనుకోవడం సరైంది కాదన్నారు.

జగన్ పర్యటనతో రైతులకు న్యాయం

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటించడం వల్లే రైతులకు న్యాయం జరుగుతోందని, మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ వెళ్లి రైతులతో మాట్లాడిన తరువాతే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. మిర్చి, పొగాకు, మామిడి పంటల కొనుగోళ్లలో జరిగింది ఇదేనన్నారు. జగన్ వస్తున్నారని తెలిసి ముందురోజు హడావుడిగా కొనుగోళ్లు జరుపుతున్నారని పేర్కొన్నారు. సబ్సిడీ ధరకు మామిడి కొనుగోళ్ల జిఒ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.200 కోట్ల విడుదలకు తక్షణమే ఆదేశాలివ్వాలని, సబ్సిడీ ధరకు తోతాపురి కొనుగోళ్లు అన్ని ప్రాంతాలకు అమలు చేయాలని కోరారు. చిత్తూరు పర్యటనలోనూ హెలిప్యాడ్‌కు చివరి నిమిషం వరకూ అనుమతి ఇవ్వలేదని అన్నారు. 100 మీటర్ల దూరంలో హెలిప్యాడ్‌కు అనుమతి ఇచ్చినట్లు ఆధారాలు చూపించాలన్నారు. రెండు రోజుల ముందు టిడిపి నాయకులు ట్రాక్టర్లతో మామిడి కాయలు తెచ్చి రోడ్డుపై పోస్తే.. వారిపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు.



ఆర్‌డిఒ కోసం వేచిచూస్తున్న బాధిత రైతులు

రైతులతో సమావేశానికి ఆర్‌డిఒ డుమ్మా

- కార్గో ఎయిర్ పోర్టు బాధిత అన్నదాతల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి: కార్గో ఎయిర్‌పోర్టు భూముల కోసం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి పలాస ఆర్‌డిఒ వెంకటేష్ గైర్హాజరు కావడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం రాంపురం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్ పొట్టి ధర్మారావుతో పాటు రైతులకు శుక్రవారం సమావేశం ఉందంటూ నాలుగు రోజులుగా అధికారులు సమాచారం ఇస్తున్నారు. దీంతో రాంపురంతో పాటు ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. సుమారు మూడున్నర గంటలు వేచిచూసినా ఆర్‌డిఒ వెంకటేష్ రాకపోవడంతో విసిగి వేశారిన రైతులు, స్థానికులు పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు వచ్చి, స్థానిక మండపం వద్ద నిరసన తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టుకు సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఎయిర్‌పోర్టు పేరుతో భూములు తీసుకుంటే, దీనిపై బతుకుతున్న పేదలు జీవనాధారం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం భూములను తీసుకోవాలని చూస్తోందన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి బాధిత రైతులకు అండగా నిలిచి ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డు సభ్యులు బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, తామాడ తుంబనాథం, చిత్త గున్నయ్య, దాసరి మోహన్, తామడ హేమరాజ్, జుత్తు భూపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారుల ఇళ్లలో సబార్డినేట్లు పనిచేయొచ్చు : హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

ఇంటి పనులు చేసే విషయంలో న్యాయాధికారులపై జిల్లా కోర్టుల్లో పనిచేసే ఆఫీస్ సబార్డినేట్ల ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని హైకోర్టు వెల్లడించింది. న్యాయాధికారుల ఇళ్లలో పనులు ఆఫీసు సబార్డినేట్ల విధుల్లో భాగం కాదని ఎపి జ్యుడీషియల్ ఆఫీస్ సబార్డినేట్ల సంఘం వాదనను తిరస్కరించింది. 1992లో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్న విధులే అంతిమం కాదని ఇతర విధులు కూడా వారికి అప్పగించవచ్చునని పేర్కొంది. న్యాయాధికారుల ఇళ్లలో ఇంటి పనుల బాధ్యతలను కొందరు ఆఫీసు సబార్డినేట్లకు అప్పగించే విధానం ఉందని తెలిపింది. న్యాయాధికారుల ఇళ్లలో పనులు ఆఫీసు సబార్డినేట్ల విధుల్లో భాగం కాదంటూ ఎపి జ్యుడీషియల్ ఆఫీస్ సబార్డినేట్ల సంఘం వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

గోదావరి 'గండం'!

- భద్రాచలం వద్ద 36 అడుగులు దాటిన నీటిమట్టం
- ఉధృతంగా శబరి
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 28 గ్రామాలకు రాకపోకలు బంద్
- సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న ముంపు మండలాల ప్రజలు



చల్లావారి గూడెం కాలనీకి ఆటోలో సామాన్లు వేసుకుని తరలిపోతున్న రాపాకగొమ్మి గ్రామస్తులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, రాజమహేంద్రవరం రూరల్

పోలవరం నిర్వాసితులను గోదావరి వరద భయం వెంటాడుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36 అడుగులు దాటేసింది. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద నీటిమట్టం దాదాపు 30 అడుగులకు చేరడంతో దిగువకు మూడు లక్షలకు క్యూసెక్కులకుపైగా నీటిని వదులుతున్నారు. శబరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గోదావరి వరద వేగంగా పెరుగుతోంది. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే నీట మునిగి దాదాపు 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు నుంచి కొయిదాకు వెళ్లే మార్గంలో ఎద్దు వాగుపై ఉన్న కాజ్‌వే నీటమునిగి కాచారం, కొయిదా, కట్కూరు, సిద్ధారం, పేరంటాపల్లి, టేకుపల్లి మొత్తం 16 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. దీంతో, వరద ముంపు పొంచి ఉన్న గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు. రాపాకగొమ్మి గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు శుక్రవారం ఆటోలో సామాన్లు వేసుకుని జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెంలోని నిర్వాసిత కాలనీకి తరలివెళ్లాయి. గొమ్ముగూడెం, రాపాకగొమ్మి తదితర గ్రామాల వారూ పునరావాస కాలనీల్లోకి వెళ్తున్నారు. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు 30కుపైగా గ్రామాలు నీటమునిగే ప్రమాదం ఉంది. దీనిపై ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన టార్పాలిన్లు సిద్ధం చేయాలని, పునరావాస కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఇప్పటికే ఆదేశించారు.

పాలకుల తీరుతో నిర్వాసితులకు నరకం

పోలవరం నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నరకం చూపిస్తున్నాయి. వరద వచ్చే సమయానికి 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తి స్థాయిలో అందించి ఖాళీ చేయిస్తామని ఏడాదిగా ఊదరగొట్టాయి. ఏటా వరద కష్టాలు పడలేకపోతున్నామని, పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చేస్తే తాము గ్రామాలు ఖాళీ చేస్తామని నిర్వాసితులు మొత్తుకున్నారు. ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో పరిహారం అందించలేదు. దీంతో, నిర్వాసితులకు మళ్లీ వరద కష్టాలు మొదలయ్యాయి. గోదావరికి వరద పోటెత్తడంతో భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. వరద సమయంలో జిల్లా ఉన్నతాధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదు. కొండలు, గుట్టలపైకి తరలివెళ్లే వరద బాధితులకు టార్పలిన్లు, కొవ్వొత్తులు, జనరేటర్, తాగునీరు వంటివి ముందుగానే ఏర్పాటు చేయాలి. అటువంటి పరిస్థితులు క్షేత్రస్థాయిలో కానరాకపోవడంతో ఈ కష్టాలు ఎప్పుడు తప్పుతాయోనని నిర్వాసితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- విపత్తుల నిర్వహణ సంస్థ

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదిలో వరద నీరు వచ్చి చేరుతున్నందున ఆ నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా స్టేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం నెంబర్లు 112, 1070, 1800-425-0101కు సంప్రదించాలన్నారు. లంక గ్రామాల ప్రజలు బోట్లు, మోటారు బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించడం, వరద నీటిలో ఈతకు, స్నానాలకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు చేయరాదని సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 37.2 అడుగులు ఉందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 2.90 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. మరింత వరద ప్రవాహం చేరే అవకాశం ఉన్నందున ముందస్తుగా ప్రభావం ఉండే జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.



రాజధాని అమరావతిలోని ఉద్ధండరాయునిపాలెంలో రాజధాని నిర్మాణానికి ప్రధాని మోడీ తొలిసారి శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద షర్మిల, ఇతర నాయకులు

రాజధాని నిర్మాణంపై మాటతప్పిన మోడీ

- కేంద్రాన్ని నిలదీయడంలో చంద్రబాబు విఫలం : షర్మిల

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని ప్రాంతంలో అభివృద్ధి లేదని, మౌలిక సదుపాయాలు కూడా కల్పించడంలేదని, పిచ్చి మొక్కలు మాత్రమే ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని చెప్పి ప్రధాని మాట తప్పారన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలోని ఉద్ధండరాయునిపాలెంలో ఆమె శుక్రవారం పర్యటించారు. మోడీ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని, రాజధాని నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోడీ శంకుస్థాపన చేసిన ప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, పిచ్చి మొక్కలు పెరిగాయే తప్ప అభివృద్ధి లేదన్నారు. పదేళ్ల తర్వాత రెండోసారి శంకుస్థాపన చేయడం ఎబ్బెట్టుగా ఉందని తెలిపారు. 2014లో రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి 33 వేల ఎకరాలు, మరో 21 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కలిపి 54 వేల ఎకరాలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు మరో 44 వేల ఎకరాలు కావాలని అడుగుతున్నారని, ఆ భూములతో చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారా..? అని నిలదీశారు. గన్నవరం విమానాశ్రయం రాజధాని పరిధిలోకే వస్తుందని, 5 వేల ఎకరాలతో ఇంకో ఎయిర్‌పోర్ట్ అవసరమా..? అని నిలదీశారు. రాజధాని నిర్మాణంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. భూసమీకరణకు వ్యతిరేకంగా అవసరమైతే కాంగ్రెస్ తరపున పోరాటం చేస్తామన్నారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో నుంచి రూ.31 వేల కోట్లు రుణాలు తెస్తున్నారని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునే హక్కు ఉండగా అప్పుల గొడవేమిటని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులని అన్నారని, ఒక్క రాజధాని కూడా అభివృద్ధి కాలేదని విమర్శించారు.

కెనడాపై 35 శాతం టారిఫ్‌లు

వాషింగ్టన్/ ఒట్టావా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు సుంకాల దాడిని ప్రారంభించారు. వచ్చే నెలలో కెనడా నుంచి వచ్చే దిగుమతులపై 35 శాతం సుంకం విధిస్తామని, ఇతర పలు వాణిజ్య భాగస్వాములపై 15 శాతం లేదా 20 శాతం టారిఫ్‌లను విధించాలని యోచిస్తున్నామని ట్రంప్ తన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ఓ లేఖలో పేర్కొన్నారు. కొత్త రేటు ఆగస్టు 1 నుండి అమలులోకి వస్తుందని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీకి స్పష్టం చేశారు. దీనిపై కెనడా ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తే ఈ రేటు మరింత పెరుగుతుందని ట్రంప్ హెచ్చరించారు.

సంపాదకీయం


మొట్టికాయ!

నవంబర్ నెలలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)లో ఆధార్, ఓటరు కార్డు, రేషన్ కార్డులనూ పరిగణనలోకి తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడం స్వాగతించదగినది. ఆధార్ కార్డు అనేది ప్రాథమికమైన గుర్తింపు పత్రమని వ్యాఖ్యానించడమేగాక ఇసి దాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం ఆశ్చర్యం కలిగిస్తోందని న్యాయమూర్తి పేర్కొనడం ఒకవిధమైన అభిశంసనగానే భావించవచ్చు. "ఎన్నికల కమిషన్ పేర్కొన్న 11 పత్రాలకు అదనంగా ఆధార్ కార్డు, ఇసి జారీ చేసిన ఓటరు ఐడి కార్డు, రేషన్ కార్డులను కూడా ఎన్నికల కమిషన్ పరిశీలించాలని మేం చెబుతున్నాం. ఒకవేళ వాటిని తిరస్కరించేందుకు సరైన కారణాలు వున్నట్లైతే తిరస్కరించండి, కానీ కారణాలేంటో చెప్పాలి." అని జస్టిస్ ధూలియా ఉద్ఘాటనలోనే అది వ్యక్తమవుతోంది. ఎన్నికల కమిషన్ టైమ్‌లైన్‌ల పట్ల న్యాయస్థానానికి తీవ్రమైన సందేహాలు వున్నాయని, జనగణనకే ఏడాది సమయం తీసుకుంటున్నప్పుడు ఇసి డెడ్‌లైన్ కేవలం 30 రోజులే ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. 'ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఒక వ్యక్తి తన ఓటును కోల్పోతే ఇక అడిగేందుకు సమయం వుండదు, ఓటర్ల జాబితా ఖరారైన తర్వాత ఇక న్యాయస్థానాలు కలగచేసుకోవు' అని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మూలమైన ఓటు హక్కును నిరాకరించడమే అవుతుంది. అంతేగాక భారత రాజ్యాంగంలోని 324 అధికరణం ప్రకారం ఎన్నికల కమిషన్ ప్రజాస్వామిక ప్రక్రియను నిర్వహించేందుకు అవకాశాలు కల్పించాలే తప్ప ఆటంకాలు కలిగించరాదని ధర్మాసనం పేర్కొనడం మెత్తగా మొట్టికాయలు వేయడమే!

బీహార్‌లో ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ.. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ ప్రక్రియ చాలా హడావిడిగా, నిర్లక్ష్య ధోరణిలో జరుగుతోందన్న పిటిషనర్ల వాదన సబబైనదే! ఆధార్ సైతం చెల్లుబాటయ్యే పత్రం కాదని ఇసి చెప్పడాన్ని వారు సరిగానే ప్రశ్నించారు. మన రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ గుర్తింపును బట్టి తప్ప పౌరసత్వాన్నిబట్టి ఓటు హక్కు కల్పించదు. కానీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టడం తమ రాజ్యాంగ హక్కుల పరిధిలోనే వుందని ఎన్నికల కమిషన్ న్యాయవాది సమర్ధించుకోవడమేగాక త్వరలోనే దేశంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా దీన్ని నిర్వహిస్తామని కూడా పేర్కొనడం బరితెగింపే! నిజానికి ఇసి చేపడుతున్న ఈ ప్రహసనమంతా గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఏకరూప పౌరస్మృతి ప్రక్రియకు కొనసాగింపు. కాబట్టే 'బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలోకి పౌరసత్వం అంశాన్ని ఎందుకు తీసుకుపోతున్నారు? అది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని విషయం కదా' అని సుప్రీంకోర్టు బెంచ్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందిస్తూ రాజ్యాంగంలోని 326వ అధికరణ ప్రకారం ఓటరుగా అర్హత పొందాలంటే పౌరసత్వాన్ని పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. అంతేగాక ఈ సవరణ ప్రక్రియ చేపట్టిన సమయం మీద కూడా న్యాయమూర్తులు సందేహాలు వ్యక్తం చేశారు. గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాల్లో గందరగోళం, పోలింగ్‌నాడు రిగ్గింగ్ జరిగిందని, ఇప్పుడు బీహార్‌లో కూడా అదే పరిస్థితిని పునరావృతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్న ప్రతిపక్షాల ఆందోళనకు ఇది బలం చేకూరుస్తోంది. బిజెపి ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ పనిచేస్తోందన్న మాట నిజమేననిపిస్తోంది.

ఏది ఏమైనా బీహార్‌లో చేపట్టిన సవరణ ప్రక్రియపై సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు ప్రజాస్వామ్య ప్రక్రియకు బలం చేకూరుస్తాయి. ఇది కేవలం ఒక వ్యాజ్యం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం కోసం ప్రతిపక్షాలు సాగిస్తున్న ఉద్యమ కొనసాగింపు. భారత రాజకీయాల్లో బీహార్‌లో ప్రారంభమైన నిరసనలు చాలా వరకు భారీ విజయాలు సాధించిన విషయం ఒకసారి గుర్తు చేసుకోవాలి. ఆ విధంగా చూస్తే కేంద్రంలోని బిజెపి, బీహార్‌లో నితీష్ పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని భావించవచ్చు. ఈ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటానికి నిరంకుశ శక్తులను మట్టిగరిపించడానికి మరిన్ని విశాల ఐక్య ఉద్యమాలను సాగించాలి.

మహనీయుల మాట



జ్ఞానోదయాన్ని కలిగించే మాటలు ఆభరణాల కంటే గొప్పవి.
- బేగం హజరత్ మహల్
స్వాతంత్ర్య సమరయోధురాలు

కార్మిక కంటక విధానాలు ఇక చాలు

వ్యాఖ్య

జులై 9న చారిత్రాత్మక సమ్మెలో కోట్ల మంది శ్రామిక ప్రజలు వీధులను ముంచెత్తారు. వాస్తవానికి ఈ సమ్మె కోసం ఇంతకు ముందే సన్నాహాలు చేసుకున్నారు. అయితే పహల్గాంలో అమాయకులైన టూరిస్టు పౌరులను టెర్రరిస్టులు బలిగొన్న దారుణ హత్యాకాండ కారణంగా సమ్మె ఒక నెల రోజుల పాటు వాయిదా పడింది. అయినా కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజల ప్రతిఘటన స్ఫూర్తి ఏమాత్రం సడలలేదు.

ప్రభుత్వం మూడు కీలకమైన లేబర్ కోడ్లను బలవంతంగా రుద్దడం కొనసాగించడంతో ఈ ప్రతిఘటన మరింత ఊపందుకుంది. పారిశ్రామిక సంబంధాలు (ఐ.ఆర్) కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య పని పరిస్థితులు కోడ్, సామాజిక భద్రత కోడ్ మూడింటిని ప్రభుత్వం బలవంతంగా కొనసాగించింది. 2019 వేతనాల కోడ్‌తో కలిపి మొత్తం నాలుగు కొత్త కోడ్లు ప్రస్తుతం ఉన్న 44 లేబర్ చట్టాలను ఆక్రమిస్తున్నాయి. కార్మికుల జీవితాలకు సంబంధించిన వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత, పని ప్రదేశంలో భద్రత-సంక్షేమం వంటి వాటిని ఇవి ప్రభావితం చేస్తాయి. సారాంశం చెప్పాలంటే భిన్న తరగతులకు చెందిన శ్రామిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను పథకం ప్రకారం తూట్లు పొడిచేవిగా ఉన్నాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్పొరేట్ మత రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకుపోయేవిగా ఈ కోడ్‌లు ఉన్నాయి.

విస్తృత ఐక్యత

జులై 9 సమ్మెకు సన్నాహాలు ఈ దాడిని సూటిగా అడ్డుకోవాలనే దిశలో సాగాయి. ఈ సమ్మెను అన్ని ప్రధాన కేంద్ర ట్రేడ్ యూనియన్లు, పారిశ్రామిక కార్మిక సమాఖ్యలు మాత్రమేకాక సమస్త తరగతులకు చెందిన శ్రమజీవులు బలపరచటం కీలకమైన అంశం. నిర్మాణ రంగంలోని అసంఘటిత కార్మికుల నుంచి ఆర్థిక రంగంలో ఉద్యోగుల వరకు, వలస కార్మికుల వరకు ఒక్క తాటిపై నిలిచి ముక్తకంఠంతో నినదించారు.

విస్తారమైన రైతాంగ వేదికగా ఉన్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.యం) మద్దతు, భాగస్వామ్యం కూడా అంతే కీలకమైనవి. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనే కోరికతో పాటు లోతుగా వేళ్లూనుకుంటున్న వ్యవసాయ సంక్షోభాన్ని ఎత్తిచూపే కనీస మద్దతు ధరకు హామీ ఉండాలనే దీర్ఘకాలిక అపరిష్కృత కోర్కెను రైతు సంఘాలు ముందుకు తెచ్చాయి. వ్యవసాయ, కార్మిక సంఘాలు కూడా గ్రామీణ ఉపాధికి సంబంధించిన ఎడతెగని ఆందోళనను, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ పథకం అంతకంతకు హరించుకు పోవడాన్ని ఎత్తి చాటాయి.



> **కార్మికులు ఈ విధంగా ఒక తాటిపైకి రావటంతో బహుశా మొదటిసారిగా ఒక విస్తారమైన ఐక్యత ఆవిర్భవించింది. ప్రస్తుతం దేశంలోనే విస్తార సంఖ్యలో ఉన్న ప్రజానీకం జీవనోపాధికి సంబంధించి అంతకంతకు పెరిగిపోతున్న సంక్షోభం తీవ్రతను వెల్లడించింది. ఒక విధంగా చెప్పాలంటే ఇది కేవలం జీవనోపాధి సమస్యగా ఎంత మాత్రం లేదు. మనుగడ కోసం పోరాటంగా మారింది. ప్రస్తుత ప్రతిపాదిత లేబర్ కోడ్‌ల వల్ల ముంచుకొస్తున్న సర్వవ్యాప్త ప్రమాదం తీవ్రత కారణంగానే జులై 9 సమ్మె అంత ఉధృతంగా నడిచింది. ప్రస్తుతం ఉన్న అన్ని నియంత్రణ చట్టాలను దాదాపు మటుమాయం చేసి కార్పొరేట్లకు అడ్డు లేకుండా చేయటమే ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం. కార్మికులకు ఇంకా ఏమైనా కనీస చట్టబద్ధమైన రక్షణ అంటూ ఉంటే దాన్ని కూడా లేకుండా చేయడమే జరుగుతుంది. ఈ కోడ్‌లను ప్రభుత్వం కార్మిక అనుకూల చర్యలుగా చిత్రించాలని చూడటం ఎంతైనా విడ్డూరం.**

కార్మికులు ఈ విధంగా ఒక తాటిపైకి రావటంతో బహుశా మొదటిసారిగా ఒక విస్తారమైన ఐక్యత ఆవిర్భవించింది. ప్రస్తుతం దేశంలోనే విస్తార సంఖ్యలో ఉన్న ప్రజానీకం జీవనోపాధికి సంబంధించి అంతకంతకు పెరిగిపోతున్న సంక్షోభం తీవ్రతను వెల్లడించింది. ఒక విధంగా చెప్పాలంటే ఇది కేవలం జీవనోపాధి సమస్యగా ఎంత మాత్రం లేదు. మనుగడ కోసం పోరాటంగా మారింది. ప్రస్తుత ప్రతిపాదిత లేబర్ కోడ్‌ల వల్ల ముంచుకొస్తున్న సర్వవ్యాప్త ప్రమాదం తీవ్రత కారణంగానే జులై 9 సమ్మె అంత ఉధృతంగా నడిచింది. ప్రస్తుతం ఉన్న అన్ని నియంత్రణ చట్టాలను దాదాపు మటుమాయం చేసి కార్పొరేట్లకు అడ్డు లేకుండా చేయటమే ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం. కార్మికులకు ఇంకా ఏమైనా కనీస చట్టబద్ధమైన రక్షణ అంటూ ఉంటే దాన్ని

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కూడా లేకుండా చేయడమే జరుగుతుంది. ఈ కోడ్‌లను ప్రభుత్వం కార్మిక అనుకూల చర్యలుగా చిత్రించాలని చూడటం ఎంతైనా విడ్డూరం.

పైకి ఎంతగా గంభీరం వలకపోసినా తన బూటకత్వం ప్రజల ముందు బట్టబయలవుతుందనేది ప్రభుత్వానికి తెలుసు. పని పరిస్థితులు దారుణంగా దిగజారిపోవడం కళ్ళ ముందు కనిపిస్తూనే ఉంది. అలా లేదని ఖండించడం ఇంకెంత మాత్రం సాధ్యం కాని విషయమైంది. శ్రామిక ప్రజల పరిస్థితి క్షీణించడానికి రెండు కీలక అంశాలు కారణమైనాయి. ఒకటి పెరిగిపోతున్న నిరుద్యోగం, మరొకటి భయానకమైన స్థాయిలో అసమానతల పెరుగుదల.

దిగజారిన పరిస్థితులు

జనవరి 31న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024 ఆర్థిక సర్వేలో కూడా అదనంగా జోడించబడిన స్థూల విలువ (జి.వి.ఎ) లో శ్రామిక వాటా పెరుగుదల నామమాత్రంగానే ఉందని పేర్కొంది. మరీ ముఖ్యంగా బడా కంపెనీల్లో ఇది ఇంకా తక్కువగా ఉండటం గమనిస్తే ఆర్థిక అసమానతల తీవ్రత అర్థమవుతుంది. కార్మికులు, ఇతర పీడిత ప్రజల హక్కులపై ప్రభుత్వం ఇంత తీవ్రంగా దాడి చేస్తూనే మరోవైపున అదే సమయంలో ఇదివరకు ఎన్నడూ లేని స్థాయిలో కార్పొరేట్లకు 1.45 లక్షల కోట్ల నజరానా కట్టబెడుతున్నది. విద్యా వైద్యం కలిపి కేటాయించిన బడ్జెట్ మొత్తం కంటే ఇది చాలా ఎక్కువ. జాతీయ కుటుంబ సర్వే (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్) ఆరోగ్య నివేదికలో ఇది కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. బ్రిటిష్ వారి పాలనలో కన్నా ఈనాటి భారత దేశంలోనే అసమానతలు ఎక్కువగా ఉన్నాయనే స్థాయిలో కూడా కొంతమంది ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఇందుకు పూర్తి భిన్నంగా చూస్తే కార్పొరేట్ కులీనుల సంపదలు ఆశ్చర్యకరంగా పెరుగుతున్నాయి. 2014లో 100 కోట్ల పైబడిన సంపద కలిగిన శతకోటీశ్వరులు వందమంది ఉంటే ఇప్పుడు అది రెట్టింపుగా 200కు పెరిగింది. దేశంలో వంద మంది శతకోటీశ్వరుల ఉమ్మడి సంపద లక్ష కోట్ల అమెరికన్ డాలర్లు దాటింది. ఈ విధంగా జుగుప్సాకరమైన స్థాయిలో సంపద గుట్టలు పడటం, మరోవైపున విస్తారమైన శ్రామిక జన బాహుళ్యం ఆదాయాలు క్షీణించిపోవడం కనిపిస్తుంది. శ్రామికుల ప్రతి శ్వాసలో, ప్రతి చెమట బొట్టులో కనిపించే అంతులేని అన్యాయం జులై 9 ప్రజా కార్యాచరణలో ప్రతిబింబించింది.

భద్రత బలి

బాగా ప్రచారం అవుతున్న లేబర్ మార్కెట్ సులభతరం అనే వాదాన్ని వ్యవస్థీకృతం చేసేవిగా ఈ లేబర్ కోడ్‌లు ఉన్నాయి. ఈ దక్పథం మొదటిసారిగా 2009లో బిజెపి ఎన్నికల ప్రణాళికలో ప్రత్యక్షమైంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది ఇష్టానుసారం పనిలో చేర్చుకొని తొలగించే పద్ధతికి ముద్దుపేరు మాత్రమే. తద్వారా ప్రస్తుతం కార్మికులకున్న కొద్దిపాటి కనీస రక్షణలను కూడా లేకుండా చేయటానికి ఉద్దేశించబడింది. కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవటం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో కేవలం నాలుగు శాతం మంది కార్మికులు మాత్రమే ఈ ఔట్‌సోర్సింగ్ వలయం బయట, చెమట కొల్లగొట్టే దోపిడీ వాతావరణం బయట ఉన్నారు. లేబర్ కోడ్‌లపై ఇప్పుడు పెడుతున్న ప్రత్యేక కేంద్రీకరణ ఈ కొద్దిమంది శ్రామికులకు కూడా కార్మిక సంఘాల హక్కులను లేకుండా చేయడానికి...ద్రవ్య పెట్టుబడితో నడిచే నయా ఉదారవాద వ్యవస్థకు మేలు చేయడానికి ఉద్దేశించిన చర్యే. కార్మిక సంఘాలకు, వాటి సమిష్టి బేరసారాల హక్కును తూట్లు పొడవటమే దీని ప్రధాన లక్షణం. భారతదేశం ప్రస్తుతం ఆర్థిక సమానత విషయంలో నాలుగో స్థానానికి చేరుకున్నదని ప్రభుత్వం ఒక సందేహాస్పద పరిశోధనలను ఉటంకించడం పచ్చి బూటకంగా గోచరిస్తుంది. ఇది అన్ని విధాల అసంబద్ధమైన వ్యవహారం. ఈ సందర్భంలో ఖర్చుకు సంబంధించిన డేటాను ఆదాయానికి సంబంధించిన డేటాగా చూపించటం విడ్డూరమే కాకుండా మోసం కూడా.

కార్పొరేట్ ప్రాయోజకులనూ విదేశీ నేస్తాలను ప్రసన్నం చేసుకోవడం కోసం పాకులాడుతున్న ప్రభుత్వానికి జులై 9 సమ్మెలో శ్రామిక ప్రజానీకం ప్రదర్శించిన దృఢ సంకల్పం ఒక హెచ్చరిక. శ్రామిక ప్రజల కోరికలను ఆమోదిస్తుందా లేదా అన్నది ప్రభుత్వానికి సంబంధించిన విషయం. కానీ ఒకటైతే ఖాయం. వాళ్లు ఏ మాత్రం వెనుకడుగు వేయబోరు. ఈ పోరాటం ఇంకా పెరుగుతుంది. మరింత బలోపేతమైన ప్రభంజనంతో మరింత విశాలమైన ఐక్యతతో ముందడుగు వేసే దిశలో ఉంది.

/జులై9 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం/

చదువుల్లో చతికిలబడుతున్న బాల్యం

విశ్లేషణ

వి. రాంభూపాల్

> **కేంద్ర బిజెపి పాలకులు తమ మతతత్వ భావాలకు అనుగుణంగా చరిత్రను ఇష్టం వచ్చినట్లు వక్రీకరిస్తున్నారు. విద్యాలయాల్లో మూఢవిశ్వాసాలను పెంచే జ్యోతిష్యం, భూతవైద్యం లాంటి వాటిని పాఠ్యాంశాలుగా చేస్తున్నారు. దీని దుష్ఫలితం ఈ సర్వేలో వెలుగులోకి వచ్చింది. తొమ్మిదవ తరగతి చదివే పిల్లల్లో 45 శాతం మంది మాత్రమే మన రాజ్యాంగ కనీస సూత్రాలను, జాతీయోద్యమ అవసరాన్ని అర్థం చేసుకోగలుగు తున్నారని సర్వే తెలపడం అత్యంత ఆందోళనకరమైనది. ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సైతం కాలికి నల్లతాడు, చేతులకు తాయత్తులు, రకరకాల మాలలు ధరించడం నేడు సర్వసాధారణమైంది. ఈ పరిస్థితుల్లో ఆరవ తరగతి చదివే పిల్లల్లో 44 శాతం మంది తమ చుట్టూ వున్న మొక్కలను, మూలికలను గుర్తించడంలేదని, 34 శాతం మంది జీవులకు, నిర్జీవులకు తేడా గుర్తించడం లేదని ఈ సర్వే తెలపడంలో ఆశ్చర్యంలేదు. ఆవు పేడ, ఆవు మూత్రంలో అద్భుతాలు వున్నాయని, మన పురాణాల్లోనే అన్నీ వున్నాయని పాలకులు చెప్పే మాటలు, మీడియా చేసే ప్రచారాల ప్రభావం పసిపిల్లలపై ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుంది.**

దేశంలో పాఠశాల విద్యార్థుల చదువులు నాసిరకంగా వున్నాయని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 781 జిల్లాలు, 74,229 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్న 21,15,022 మంది విద్యార్థులను కేంద్ర విద్యాశాఖ 'పరాఖ్' ద్వారా సర్వే చేయించింది. గత సంవత్సరం డిసెంబరు 4న ప్రారంభించిన ఈ సర్వే వివరాలను తాజాగా ప్రకటించింది. పాఠశాల విద్య ప్రమాణాలు పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం దృష్టి పెట్టాల్సిన అత్యంత ముఖ్యమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. పిల్లల చదువుల స్థాయినే కాదు, పాలకుల విధానాలను పునరాలోచించుకోవలసిన అవసరాన్ని ఈ సర్వే చర్చనీయాంశం చేసింది.

ఆరవ తరగతి పిల్లల్లో 71 శాతం మంది కూడికలు, తీసివేతలు, తొమ్మిదవ తరగతి పిల్లల్లో 69 శాతం మంది కూడికలు, భాగాహారాలు సరిగా చేయలేకపోతున్నారని ఈ సర్వే తేల్చింది. మూడో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆమడ దూరంలో వున్నామని పాలకులు చెబుతుంటే, తరగతి గదిలో రూపుదిద్దుకోవలసిన దేశ భవిష్యత్ ఇంతటి ఆందోళనకరంగా వుండడానికి కారణం ఎవరు? చదువును అత్యంత ఖరీదైన వ్యాపారంగా మార్చి, లక్షలాది కుటుంబాలను అప్పుల ఊబిలో ముంచి, కొద్దిమంది మేధోసంపన్నుల సృష్టి కోసం, కోట్ల మందిని గాలికి వదిలేసిన పాలకుల విధానాల దుష్ఫలితం స్పష్టంగా ఈ సర్వే నివేదికలో వెల్లడైంది.

గత అనేక సంవత్సరాల నుండి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్.ఎ.ఎస్) ద్వారా మన విద్యావ్యవస్థ తీరుతెన్నులను కేంద్ర ప్రభుత్వం సర్వే చేసి రాష్ట్రాలకు సూచనలు ఇస్తున్నది. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా కేంద్ర విద్యాశాఖ పరిధిలో స్వతంత్ర సంస్థగా 2023లో 'పరాఖ్ (పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ ఎనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్)' రాష్ట్రీయ సర్వేక్షణ్ ఏర్పడింది. దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలను పెంచడం, అసమానతలను తగ్గించడం, భాషా ప్రావీణ్యతను పెంచడం, 21వ శతాబ్దానికి సరిపడా నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం కోసం ఈ సంస్థ అధ్యయనం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యం 2030 నాటికి సార్వత్రిక, నాణ్యమైన విద్య అందించడం. దాన్ని సాధించడం కోసం 2024 డిసెంబరులో ఈ సంస్థ సర్వే నిర్వహించి, ఈ సంవత్సరం జులై మొదటి వారంలో తన నివేదికను విడుదల చేసింది. 2021 ఎన్.ఎ.ఎస్ సర్వేతో ఈ సర్వేను పోల్చి ఉన్నత తరగతులకు చేరుకునే కొద్దీ నాణ్యత తగ్గుతున్నదని గుర్తించింది.

భాష, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రాల్లో విద్యార్థుల అవగాహనా స్థాయిని శాస్త్రీయ పద్ధతుల్లో అధ్యయనం చేసినట్లు ఈ సర్వే ప్రకటించింది. చిన్నపిల్లల్లో మార్పులు చాలా వేగంగా వస్తున్న విషయం మనం గమనిస్తూనే వున్నాము. 'నా కంటే మా మనవడు, మనవరాలు సెల్‌ను, టీవీని బాగా ఉపయోగిస్తార'ని' గర్వంగా చెబుతున్న అనేకమందిని చూస్తూనే వుంటాం. మూడవ తరగతి చదువుతున్న 67 శాతం మంది పిల్లలు కొత్త పదాలను వేగంగా వాడుతున్నారని, 60 శాతం మంది చిన్నకథలను సొంతంగా అర్థం చేసుకుంటున్నారని, 99 శాతం మంది సంఖ్యలను క్రమంలో అమర్చగలుగుతున్నారని ఈ సర్వేలో కూడా నిర్ధారణ అయ్యింది. మూడవ తరగతి పిల్లలతో పోల్చితే తొమ్మిదవ తరగతి పిల్లలు భాష విషయంలో నాసిరకంగా వున్నారని తెలిపింది. మూడవ తరగతి పిల్లలు మాతృభాషలో చదవడం, పలకడం ఇందుకు ప్రధాన కారణం అనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. మాతృ భాష ద్వారా మాత్రమే తమ అనుభూతులు, అభిప్రాయాలను సులభంగా పిల్లలు వ్యక్తం చేస్తారు. ఇంగ్లీషు భాషా వ్యామోహంతో మాతృభాష నిర్లక్ష్యానికి గురవుతుంటే, ఒకే భాష పేరుతో పాలకులు హిందీని బలవంతాన పసిపిల్లలపై రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. మాతృభాషలో విద్యా బోధన అవసరాన్ని ఈ సర్వే పరోక్షంగానైనా అంగీకరించాల్సి వచ్చింది.

చరిత్ర, రాజకీయ, సామాజిక, ఆర్థిక అవగాహనకు తోడ్పడే సాంఘిక శాస్త్రాలను గత మూడు దశాబ్దాలకు పైగా పాలకులు నిర్వీర్యం చేశారు. సాంకేతిక విద్యకు, సాంఘిక శాస్త్రాలకు పోటీ పెట్టి సాంఘిక శాస్త్రాల అవసరమే లేదనేంతగా పాలకులు మాట్లాడారు. మన రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుండి యూనివర్శిటీ స్థాయి వరకు సాంఘిక శాస్త్రాల పరిస్థితి గత రెండున్నర దశాబ్దాల్లో ఎంత దయనీయంగా మారిందో చూస్తున్నాము. కేంద్ర బిజెపి పాలకులు తమ మతతత్వ భావాలకు అనుగుణంగా చరిత్రను ఇష్టం వచ్చినట్లు వక్రీకరిస్తున్నారు. విద్యాలయాల్లో మూఢవిశ్వాసాలను పెంచే జ్యోతిష్యం, భూతవైద్యం లాంటి వాటిని పాఠ్యాంశాలుగా చేస్తున్నారు. దీని దుష్ఫలితం ఈ సర్వేలో వెలుగులోకి వచ్చింది. తొమ్మిదవ తరగతి చదివే పిల్లల్లో 45 శాతం మంది మాత్రమే మన రాజ్యాంగ కనీస సూత్రాలను, జాతీయోద్యమ అవసరాన్ని అర్థం చేసుకోగలుగుతున్నారని సర్వే తెలపడం అత్యంత ఆందోళనకరమైనది. ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సైతం కాలికి నల్లతాడు, చేతులకు తాయత్తులు, రకరకాల మాలలు ధరించడం నేడు సర్వసాధారణమైంది. ఈ పరిస్థితుల్లో ఆరవ తరగతి చదివే పిల్లల్లో 44 శాతం మంది తమ చుట్టూ వున్న మొక్కలను, మూలికలను గుర్తించడం లేదని, 34 శాతం మంది జీవులకు, నిర్జీవులకు తేడా గుర్తించడం లేదని ఈ సర్వే తెలపడంలో ఆశ్చర్యం లేదు. ఆవు పేడ, ఆవు మూత్రంలో అద్భుతాలు వున్నాయని, మన పురాణాల్లోనే అన్నీ వున్నాయని పాలకులు చెప్పే మాటలు, మీడియా చేసే ప్రచారాల ప్రభావం పసిపిల్లలపై ఎంత తీవ్రంగా వుందో అర్థమవుతుంది.

మూడు దశాబ్దాలుగా ఇంజనీరింగ్ విద్యకు కేంద్ర, రాష్ట్ర పాలకులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. 'లెక్కలు వస్తే చాలు. లెక్కలేనంత డబ్బు' అన్నట్లు ప్రచారం చేశారు. ఐ.టి రంగంలో వచ్చిన కొన్ని అవకాశాలు ఈ ప్రచారానికి మరింత బలాన్ని ఇచ్చాయి. వీటి వల్ల అన్ని వర్గాల్లో ఇంజనీరింగ్ విద్యా వ్యామోహం పెరిగింది. ప్రాథమిక స్థాయి నుండే ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎం కోర్సులు అంటూ కార్పొరేట్ విద్యాలయాలు సొమ్ము చేసుకుంటున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు, ముఖ్య పట్టణాల్లో ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో అనేక విద్యాలయాలు వెలిశాయి. ఆరవ తరగతి చదివే 54 శాతం మంది పిల్లలు లెక్కల్లో స్థానాల విలువలను ఖచ్చితంగా ఉపయోగించడం లేదని, 29 శాతం మంది మాత్రమే సాధారణ భాగాహారాలను చేయగలుగుతున్నారని, తొమ్మిదవ తరగతి పిల్లల్లో 31 శాతం మంది మాత్రమే పూర్ణాంకాలు, భిన్నాలు అర్థం చేసుకుంటున్నారని ఈ సర్వే తేల్చింది. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న గణిత శాస్త్రంలో ఇంత నాసిరకంగా పిల్లలు వుండడానికి కారణాలు ఏమిటో పాలకులు ఇప్పటికైనా గుర్తించాలి. అభూత కల్పనలతో ప్రజలను మభ్య పెట్టే పాలకుల విధానాలు మారాలి. పిల్లల జీవితాలతో చెలగాటమాడే విద్యా వ్యాపార సంస్థలను నియంత్రించాలి. ప్రాథమిక, ఉన్నత విద్యా సంస్థలలోని పిల్లల అభిరుచులను గుర్తించాలి. అందుకు అనుగుణమైన విద్యను అందించాలి. అన్నింటికీ ఒకే మంత్రం అన్నట్లు చేస్తే ఇలాగే వికటిస్తుంది. మనకంటే వెనుక స్వాతంత్ర్యం సాధించుకున్న చైనా పరిశోధనా రంగంలో అద్భుతమైన ప్రయోగాలు చేస్తూ ప్రపంచ పేటెంట్‌లలో 25 శాతం వాటాతో అగ్రభాగాన కొనసాగుతుంటే, మనం మాత్రం ఒక శాతం లోపు ఎక్కడో అట్టడుగున వున్నాం. పిల్లల అభిరుచికి తగ్గట్టు ప్రాథమిక స్థాయి నుండి విద్యను అందించకపోవడం దీనికి ఒక ముఖ్య కారణం.



ఈ సర్వేలోని మూడు గ్రేడ్‌లలో కేరళ అగ్రభాగాన వుంది. అక్షరాస్యతలోనే కాకుండా విద్య నాణ్యతా ప్రమాణాల్లో కూడా ఆ రాష్ట్రం ముందు భాగాన వుండడం ఎలా సాధ్యమైందో దేశ, రాష్ట్ర పాలకులు గమనించాలి. ప్రభుత్వ విద్యను పరిరక్షించుకుంటూ, అనేక ప్రయోగాలను ప్రాథమిక స్థాయి నుండి ఆ రాష్ట్రం అమలు చేస్తున్నది. పిల్లలకు ఆరోగ్య అవగాహన కల్పించేందుకు, పాఠశాలల్లో వాటర్ బెల్, ప్రకృతి, ఆహారం, శ్రమ పట్ల అవగాహన కల్పించేందుకు...శెలవు రోజుల్లో వ్యవసాయ పనుల్లో భాగస్వాములను చేయడంతో పాటు, ఆధునిక రోబోలతో విద్యా బోధన చేయడం వరకు కేరళ ఆదర్శంగా వుంది. అందువల్లే ఈ సర్వేలో ఆ రాష్ట్ర విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. కేరళ తర్వాతి స్థానాల్లో పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు వుండగా, గిరిజన, మైనారిటీ ప్రజలు ఎక్కువగా వున్న జార్ఖండ్, జమ్ము కాశ్మీర్, మేఘాలయ రాష్ట్రాల విద్యార్థులు ఈ సర్వేలో చివరి స్థానాల్లో వుండడం ఆందోళనకరం. విద్యా ప్రమాణాలను కూడా బిజెపి పాలిత రాష్ట్రాల డబుల్ ఇంజన్ సర్కార్‌లు లాగలేకపోతున్నాయి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

అభిప్రాయం

చట్టం అందరికీ సమానమేనా?

"నా భర్త జైలుకు వెళ్లిన తర్వాత నేను నర్సింగ్ వృత్తిని ఎన్నుకుని, తద్వారా ఎంతోమందికి సేవ చేస్తూ సాంత్వన పొందాలని కోరుకున్నాను. రోజుల వ్యవధిలో చనిపోయే రోగులు, మరణం ముందుగానే తెలిసి మానసికంగా కుంగిపోతున్న హృదయాలకు ఇంతో అంతో ఓదార్పునిస్తూ మనో నిబ్బరాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నాను. 80 ఏళ్ల పైబడి కొద్ది రోజులలో చనిపోబోయే ఒక పెద్దాయన శరీరాన్ని శుభ్రం చేస్తున్న సందర్భంలో 'మీరు ఏమిటోళ్లు?' అంటూ ఆయన నా కులాన్ని ప్రశ్నించినప్పుడు నేను ఎంతో మనోవేదన చెందాను." ఇటీవల విడుదలైన '23' (ఇరవై మూడు) సినిమాలో ఒక ప్రధాన పాత్రధారి ఆవేదనా భరితంగా చెప్పిన ఈ మాటలు భారతదేశ కుల వ్యవస్థ అస్తిత్వాన్ని, కులం ఉనికిని తెలియజేస్తుంది. కన్నతల్లిలా సాకుతూ సేవలు చేస్తున్న ఆ నర్సు కులం కారణంగా అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నదంటే నేటికీ మనిషిని మనిషిగా చూడలేని ఈ సమాజం పోకడలను అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కుల నిర్మూలన కోసం ఎంతగానో తపించారు. నేటి సమాజం పోకడలు చూసినవారికి ఆ మహనీయుని ఆకాంక్ష నెరవేరడం సాధ్యం అవుతుందా అనే ఆందోళన కలగక మానదు. గత వారం ఓటిటిలో '23' సినిమా చూసిన నాకు కళ్లు చెమర్చాయి. మన సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా? అనే ప్రశ్నను ప్రధానంగా లేవనెత్తిందీ చిత్రం. తొంభయ్యవ దశకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మూడు అతి దారుణమైన సంఘటనలలో పదుల సంఖ్యలో అమాయకులు హతులయ్యారు. హేయమైన ఆ నరమేధాల కథాంశంతో తెరకెక్కిన సినిమా ఇది. ఈ మూడు ఘటనలలో పోలీసులు, చట్టం, న్యాయ వ్యవస్థ ఒకే విధంగా స్పందించాయా? నిందితులకు తగిన శిక్షలు పడ్డాయా? పడిన శిక్షలు అమలు జరిగాయా? చట్టం ముందు నేరస్థుడు ఎంతటి వాడైనా శిక్ష తప్పదు అని మనం తరచూ చెప్పే మాటలు వాస్తవాలేనా? అన్న ప్రశ్నలను లేవనెత్తుతూ సామాజిక కోణాన్ని స్పృశించిన సినిమా '23'.

- నేలపూడి స్టాలిన్ బాబు,
సెల్ : 8374669988

నల్లపురెడ్డిపై కేసు వివరాలివ్వండి

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు జిల్లా, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని కోవూరు పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలు అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నల్లపురెడ్డి వేసిన వ్యాజ్యంపై విచారణను ఈ నెల 15కి వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించాలి

- ప్రభుత్వ వైద్య కళాశాలలపై ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు వైద్య కళాశాలల్లో బయట పడిన అవినీతి దృష్ట్యా ఉంచుకుని, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. విశాఖపట్నంలోని గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజీతో సహా ప్రైవేటు వైద్య కళాశాలల్లో అవినీతి జరిగినట్లు సిబిఐ దర్యాప్తులో బయటపడిందన్నారు. ఈ కళాశాలలు ఎన్ఎంసి తనిఖీల సమయంలో లంచాలు ఇచ్చాయని తేలిందని చెప్పారు. వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి 40కు పైగా ప్రైవేటు కళాశాలల్లో ఫేక్ రికార్డులు, గెస్ట్ ఫ్యాకల్టీ, నకిలీ రోగులు, హవాలా లావాదేవీలు వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ సంఘటన వల్ల ప్రైవేటు సంస్థల లాభాపేక్షతో నడుస్తూ, వైద్య విద్య నాణ్యత, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని స్పష్టమవుతుందని తెలిపారు. ప్రజారోగ్య వేదిక (పిఎవి) ఈ విషయంపై ఎన్నోసార్లు లేఖ సమర్పించినట్లు చెప్పారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల వచ్చే ప్రమాదాలపై హెచ్చరించినట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహించి, విద్యావేత్తలు, వైద్యరంగ నిపుణులతో, ప్రజలతో చర్చించిన అనంతరం అందరూ ఏకగ్రీవంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్లు లేఖలో పేర్కొన్నారు. పిపిపి నిర్వహించిన ప్రజా ఉద్యమాల్లో రాష్ట్ర ప్రజలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సంతకాలు చేశారని తెలిపారు. ప్రైవేటీకరణ వల్ల అవినీతి, లాభాపేక్ష వంటి అంశాలు మరింత తీవ్రం అవుతాయని చెప్పారు. ఇవి నాణ్యమైన వైద్య సేవలు, వైద్యుల శిక్షణను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఇవి వివిధ నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు తక్కువ ఖర్చుకే విద్య, అట్టడుగు వర్గాలకు మంచి వైద్య సేవలను అందిస్తాయన్నారు. వీటిని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే, ఫీజులు భారీగా పెరిగి, జవాబుదారీతనం తగ్గి రోగుల సేవ కంటే లాభాలకే ప్రాధాన్యత నడుస్తాయని చెప్పారు. ఈ విషయం సిబిఐ దర్యాప్తులో కూడా స్పష్టమైందన్నారు. వైద్య సేవలు ప్రాథమిక హక్కుగా ఉండాలనే రాష్ట్ర బాధ్యతను ప్రభుత్వం వమ్ము చేస్తోందన్నారు. వైద్యవేత్తలు, వైద్య రంగ నిపుణులు, ప్రజా వ్యతిరేకతను గౌరవిస్తూ.. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. ప్రైవేటు వైద్య కళాశాలలపై నియంత్రణను బలోపేతం చేసి, అవినీతి అరికట్టాలని, ఎన్ఎంసి ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, వైద్య సేవలను మెరుగుపరచడానికి పెట్టుబడులను పెట్టి అందరికీ నాణ్యమైన విద్య, సేవలను అదించాలని కోరారు. అవినీతి ప్రక్రియలపై సిబిఐ దర్యాప్తుకు సహకరించి, దోషులైన సంస్థలు, వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాలన్నారు.

పిఎసిఎస్‌లలో ఇఆర్‌పి విధానంలోనే లావాదేవీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రోజువారీ లావాదేవీలు ఇ-పిఎసిఎస్‌లలో భాగంగా ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఇఆర్‌పి)లో మాత్రమే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాన్యువల్ విధానంలో నమోదు చేయకూడదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎండ్ ఆఫ్ డే(ఇఒడి) ప్రాసెస్ నిర్వహించడంలో విఫలమైన పిఎసిఎస్‌లకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) నుంచి రీఫైనాన్స్ నిలిపివేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా డిసిసిబిలకు ఆప్కాబ్ నుంచి రీఫైనాన్స్‌కు అవకాశం ఉందన్నారు. డిసిసిబిలు వారి పరిధిలో ఉన్న పిఎసిఎస్‌లలో ఇఆర్‌పి విధానంలోనే తమ లావాదేవీలను నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పిఎసిఎస్‌ల ఖతాల ఆడిట్‌ను ఇఆర్‌పి విధానంలోనే చేయాలన్నారు.

ఎయిడెడ్ సిబ్బంది నియామకాలకు మార్గదర్శకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు జిఒ 30ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం విడుదల చేశారు. నియామకానికి సంబంధించిన అంశాన్ని ముందుగా పత్రికల ద్వారా తెలపాలని ప్రభుత్వం తెలిపింది. సిబ్బందికి 100 మార్కులకు పరీక్ష నిర్వహించాలంది. 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షను, మిగిలిన 20 మార్కులను టెట్ వెయిట్‌ను తీసుకోవాలని పేర్కొంది. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి 0.5 మార్కుల చొప్పున పదేళ్లకు మించి ఇవ్వకూడదని తెలిపింది. డిఎస్‌సిలో అమలు చేస్తున్న మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అనుసరించాలని వెల్లడించింది. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని పేర్కొంది. మైనార్టీ విద్యా సంస్థలకు మాత్రం దీని నుంచి మినహాయింపు ఇచ్చింది.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి తాత్కాలిక ఊరట

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో వైసిపి నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి శుక్రవారం హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. బుధవారం వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. విచారణను ఈ నెల 16కు వాయిదా వేస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఆదేశాలిచ్చారు.

మధ్యాహ్న భోజన మెనూ ధరలు పెంచండి

● వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ధరను పెంచాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ... రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైమరీ విద్యార్థులకు రూ.6.19 చొప్పున, యుపి, హైస్కూల్ విద్యార్థులకు రూ.9.26 చొప్పున పెంచిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఛార్జీల పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా పాత ధరలను అమలు చేస్తోందన్నారు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో వెంటనే కొత్త ధరలతో ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనం రూ.5 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె ఆయుధం

● మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

● కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళనలు



నంద్యాలలో కళ్లు, నోరు, చెవులు మూసుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జీఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు జిల్లాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. విజయవాడలో స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి లెనిన్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వరకు కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మె ఆయుధంగా చేసుకొని విజయం సాధించాల్సి ఉంటుందని, దీనిలో భాగంగా విశాల ఐక్యత ద్వారా అందరినీ కలుపుకొని పురోగమించాలని అన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందన్నారు. ఆందోళనకు మద్దతుగా ఈ నెల 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు, యుడిజి సెక్షన్‌కు చెందిన వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్లు కూడా సమ్మెకు మద్దతుగా నిలుస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాల పెంపు వ్యవహారంలో అత్యంత మొండి వైఖరితో వ్యవహరిస్తోందని చెప్పారు. ఒక వైపు పని భారం, మరోవైపు అరకొర వేతనాలతో దశాబ్దాల తరబడి కార్మికులు గొడ్డు చాకిరీ చేస్తున్నా...పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. స్కిల్డ్ వర్కర్లుగా ఉండే ఇంజనీరింగ్ కార్మికులకు అన్‌స్కిల్డ్ వేతనాలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారని, ఇది ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎమ్‌టిఎంసి) పరిధిలోని కొలనుకొండ, వడ్డేశ్వరం, కుంచనపల్లి, ఇప్పటం, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి గ్రామంలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బైక్ ర్యాలీ చేశారు. విశాఖ జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరం వద్ద రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియుతో పాటు పలు కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో బైక్ ర్యాలీ చేపట్టారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లు, చెవులు, ముక్కు మూసుకొని కార్మికులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

కాంట్రాక్టు లెక్చరర్స్ జెఏసి విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు పెండింగ్‌లో ఉన్న 2024 నెల జీతాలు విడుదల చేసేందుకు చొరవ తీసుకోవాలని సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్స్ జెఏసి కోరింది. ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన ఫైల్‌కు అధికారులు జాప్యం చేయడం బాధాకరమని జెఏసి ఛైర్మన్ కె సురేష్, కె శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'స్మార్ట్ మీటర్, ట్రూఅప్ ఛార్జీల' సదస్సుకు రండి

● పలు అసోసియేషన్లకు ఐక్య ప్రజావేదిక వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ 'స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూఅప్ ఛార్జీల రద్దు' అనే అంశంపై నిర్వహించే సదస్సుకు హాజరుకావాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక పలు అసోసియేషన్లను కోరింది. ఈ నెల 13న విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహించే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వేదిక నాయకులు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు శుక్రవారం విజయవాడలోని వివిధ అసోసియేషన్ల నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాజ్జీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై ఈశ్వరరావు, ఇండ్రస్టియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు ఉన్నం శ్రీరాము, ఫిల్మ్‌ఛాంబర్ అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను శివప్రసాద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు గడ్డం రవికుమార్, ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్‌ను కలిసి సదస్సుకు హాజరై కార్యాచరణకు సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు ఆన్ డ్యూటీ డిప్యుటేషన్లు అనుమతించొద్దు

● జిఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ శివప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రేషనలైజేషన్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి ఆన్ డ్యూటీ డిప్యుటేషన్లకు అనుమతించొద్దని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఆదేశించారు. విజయవాడలోని జిఎస్‌డబ్ల్యుఎస్ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం జిఎస్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు, డిఎల్‌డిఓస్, మున్సిపల్ కమిషనర్లు, డిసి అండ్ ఎడిసి, అడిషనల్, జాయింట్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. బదిలీలు అయిన ఉద్యోగులందరూ తక్షణమే రిలీవ్ కావడం, నూతన ప్రదేశంలో జాయిన్ అయినట్లు ఈ నెల 20లోగా హెచ్‌ఎంఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టల్‌లో బయోమెట్రిక్ నమోదు చేయా లని, బదిలీ సమయానికి ఆయా ఫంక్షనరీలకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించి నోడ్యూస్ తీసుకోవాలన్నారు.

బెంగాలీ మాట్లాడటమే నేరమా?



ఢిల్లీలో పోలీసుల వేధింపులకు గురైన వారితో బృందాకరత్, అనురాగ్ సక్సేనా తదితరులు

- బెంగాలీ ముస్లింలందరూ నేరస్తులేనా?
- దేశ రాజధానిలో మానవ హక్కులకు పాతర
- బలవంతపు వసూళ్లు!
- సరైన పత్రాల్లేని బంగ్లాదేశీ వలసదారుల గుర్తింపు ప్రక్రియపై అమిత్ షాకు సిపిఎం నేతల లేఖ

న్యూఢిల్లీ : కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు 'సరైన పత్రాలు లేని బంగ్లాదేశీ ఇమ్మిగ్రెంట్లను గుర్తించేందుకు' ఢిల్లీ పోలీసులు, ఇతర సంస్థలు అమలు చేస్తున్న ప్రక్రియలో మానవ హక్కులు దారుణంగా ఉల్లంఘించబడుతున్నాయని, వేధింపులు, బలవంతపు వసూళ్లు వంటివి నిత్యకృతమయ్యాయని సిపిఎం కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితురాలు, మాజీ ఎంపి బృందా కరత్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా విమర్శించారు. ఈ మేరకు వారు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. కేవలం బెంగాలీ మాట్లాడుతున్నారనే కారణంతో నిజమైన భారతీయ పౌరులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సిపిఎం నేతల బృందంతో కలిసి ఈనెల 10న తాము ఢిల్లీలోని భావనా జెజె కాలనీ సందర్శించామని, అక్కడ అనేకమంది ఫిర్యాదుదారులను కలిసి మాట్లాడామని చెప్పారు. అత్యంత దారుణమైన రీతిలో మానవ హక్కుల ఉల్లంఘన, వేధింపులను చూసి దిగ్భ్రాంతి చెందామన్నారు. కొన్ని కేసుల్లో అవినీతికి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని పేర్కొంటూ కొన్ని ఉదాహరణలను ఆ లేఖలో వివరించారు.

- చాలా దశాబ్దాల క్రితమే మహ్మద్ నిజాముద్దీన్ జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లా నుండి ఢిల్లీకి వలస వచ్చేశారు. ఆ భార్యాభర్తలిద్దరికీ జార్ఖండ్‌లో ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు వున్నారు. 2004లో భావనా జెజె కాలనీలో ఆయనకు ఒక స్థలం కేటాయించబడింది. ప్రస్తుతం అక్కడే వుంటున్నారు. జులై 5న స్థానిక పోలీసు బృందం వారి ఇంటికి వెళ్లి అక్రమ కాగితాలు సంపాదించుకునేందుకు ఒక బంగ్లాదేశ్ జాతీయుడికి సాయం చేస్తున్నారని ఆరోపించింది. తన ఇంట్లో మూడేళ్లుగా ఆ వ్యక్తి అద్దెకుంటున్నాడని, అతను ఎక్కడివాడో తనకు వివరాలేమీ తెలియదని నిజాముద్దీన్ పోలీసులకు చెప్పారు. ఈ నెల 6న ఉదయం ఆరు గంటలకే వచ్చిన పోలీసులు నిజాముద్దీన్‌కు బేడీలు వేసి అందరూ చూస్తుండగానే కరడుగట్టిన నేరస్తుడిలా పోలీసు స్టేషన్‌కు లాక్కెళ్లారు. ఆయనే బంగ్లాదేశీయుడు అంటూ పోలీసులు వ్యాఖ్యలు చేశారు. వెంట వెళ్లిన ఆయన కుమార్తె షబ్నం జార్ఖండ్‌లో తమకు గల ఆస్తితో సహా అన్ని పత్రాలు సమర్పించింది. అయినా, పోలీసులు నిజాముద్దీన్‌పై చేయి చేసుకుంటూ అసభ్య పదజాలంతో తిడుతూ బంగ్లాదేశీయుడికి ఆశ్రయమిచ్చానని ఒప్పుకోవాలని లేదా ఆయననే బంగ్లాదేశీయుడిగా ప్రకటిస్తామని అన్నారు. పిల్లలతో సహా మొత్తంగా కుటుంబ సభ్యులందరినీ పోలీసులు పట్టుకెళ్లి, అందరినీ తిట్టారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విడిచిపెట్టారు. మళ్లీ 8వ తేదీ పొద్దునే వారిని మరో పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడా వేధించారు. యువతులతో సహా అందరినీ పదే పదే ఫోటోలు తీశారు. ఆ సమయంలో సీనియర్ పోలీసు అధికారులెవరూ లేరు, జూనియర్లే వున్నారు. కొంత సమయం తర్వాత వారిని వదిలిపెట్టారు. ఇలా తర్వాత కొద్ది రోజుల పాటు వేర్వేరు పోలీసు స్టేషన్ల నుండి వచ్చిన పోలీసు బృందాలు వారి ఇంటికి వెళ్లడం పత్రాలు చూపించాలని అడిగారు. పోలీసు సైట్‌లో వారి ఫోటోలు అప్‌లోడ్ చేశామని, పోలీసు విచారణలు వుంటాయని చెప్పారు. చట్టానికి కట్టుబడిన భారతదేశ పౌరులను వేధిస్తున్న పోలీసుల చట్టవిరుద్ధమైన ప్రవర్తనకు ఇది స్పష్టమైన ఉదాహరణ అని బృందాకరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. పోలీసులు అన్నిసార్లు వారి ఇంటికి వెళ్లేసరికి వారి కుటుంబ గౌరవం దెబ్బతిందని అన్నారు. పోలీసు రికార్డుల్లో నుండి వారి ఫోటోలు తొలగించాలని డిమాండ్ చేశారు. నిజాముద్దీన్‌పై చేయి చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- భావనా సి బ్లాక్‌లో జుగ్గి సెటిల్‌మెంట్‌లో నివసిస్తున్న సాజన్ సౌదాఘర్‌ను మే 6న ప్రీతంపురా ఠానాకు పోలీసులు తీసుకెళ్లారు. బంగ్లాదేశీయుడినని ఒప్పుకోవాలంటూ ఇద్దరు పోలీసులు చితకబాదారు. నేలపై పడేశారు. బూట్లతో చెవులపై తన్నారు. సాజన్ చెవి ఒకటి బాగా దెబ్బతింది. మరో పోలీసు ఆయన మొబైల్‌ను చెక్ చేశారు. తర్వాత పొరపాటున తీసుకున్నానని చెప్పాడు. బెంగాలీ మాట్లాడుతున్నారని తమకు సమాచారం అందిందని, అందుకే తీసుకొచ్చామని వారు తర్వాత చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘనలకు ఇది మరొక స్పష్టమైన ఉదాహరణ అని పేర్కొన్నారు.
- 60, 70ఏళ్ల వయసులోని ముగ్గురు వితంతు మహిళలతో మాట్లాడాం. దశాబ్దాల క్రితం పిల్లలుగా వున్నపుడు వారిని, వారి తల్లిదండ్రులు బంగ్లాదేశ్ నుండి భారత్‌కు తీసుకువచ్చారు. వారి తల్లిదండ్రులు ఎప్పుడో చనిపోయారు. ఈ మహిళలు భారత్‌లోనే పెళ్లిళ్లు చేసుకున్నారు. వారి పిల్లలు ఇక్కడే పుట్టారు, ఇక్కడే చదువుకున్నారు, వారికి ఇక్కడే కుటుంబాలు కూడా వున్నాయి. ఇప్పుడు వారిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి మూడు రోజులు పూర్తిగా అక్కడే వుంచారు. వారికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా లాక్కున్నారు. ఆర్‌కె పురంలో పోలీసు అధికారి ముందు వారిని ప్రవేశపెట్టగా, వారి బయోమెట్రిక్‌లు తీసుకుని, వెనక్కి పంపించారు. ఇక్కడ కూడా వివిధ పోలీసు స్టేషన్లకు చెందిన పోలీసుల బృందం వారి ఇళ్లకు వెళ్లి వారిని ప్రశ్నించింది.

దశాబ్దాలుగా భారత్‌లో జీవిస్తున్న వారికి బంగ్లాదేశ్‌లో ఎవరూ లేరు. వారి పిల్లలు పుట్టుకతో భారత పౌరులు. ఏ క్షణంలోనైనా తమను బలవంతంగా తరలించొచ్చన్న భయంతో వారు ప్రతి రోజూ బతుకుతున్నారని సిపిఎం నేతలు ఆ లేఖలో పేర్కొన్నారు. నిరుపేదలైన, ఒంటరి మహిళల పట్ల ఇటువంటి ప్రవర్తన అమానవీయమైనది, అన్యాయమైనది.

- ఢిల్లీలో ఇతర చోట్ల కూడా ఇలాంటి సంఘటనలు చాలా వున్నాయి. ఉదాహరణకు మేలో చాణక్యపురిలో నివసిస్తున్న బెంగాలీల ఐడి పేపర్లను పోలీసులు తీసుకెళ్లిపోయారు. అవి వెనక్కి ఇవ్వాలంటే డబ్బులివ్వాలని కొందరు పోలీసులు డిమాండ్ చేశారు. కొంతమంది సామాజిక కార్యకర్తలు దీనిపై పోలీసులను కలిసి ప్రశ్నించగా, తాము అలాంటి ఆదేశాలివ్వలేదని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. తర్వాత ఆ పత్రాలను వెనక్కి ఇచ్చారు. ఆ తర్వాత మరో రెండు సంఘటనల్లో క్రైం బ్రాంచ్ సిబ్బంది ఇద్దరు పౌరులను అదుపులోకి తీసుకున్నారు. వారు బెంగాలీ ముస్లింలు, వారిని రోజంతా కస్టడీలో వుంచారు. పశ్చిమ బెంగాల్‌లో పుట్టినట్లు, అక్కడ ఇల్లు వున్నట్లు రుజువులు, సాక్ష్యాధారాలు వున్నా వారిని వేధించారు. జూన్ 24న ఈ సంఘటన జరిగింది.
- ఢిల్లీలో నివసిస్తూ పని చేసుకుంటున్న ఎనిమిది మంది బెంగాలీ వలస కార్మికులను జూన్ 26న బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపేశారు. బెంగాల్‌లోని బీర్భమ్ జిల్లాలోని పైకా గ్రామంలో తమకు ఇల్లు వుందని రుజువు చూపించినా వారిని వదిలిపెట్టలేదు. ఇలా పంపిన వారిలో ఒక మహిళ, ఐదేళ్ల పిల్లాడు వున్నారు. బంగ్లాదేశ్‌లో వారి పరిస్థితి ఏమిటి? పైకా గ్రామంలోని వారి కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మానవ హక్కుల ఉల్లంఘనే...

దేశ రాజధాని ఢిల్లీలో బంగ్లాదేశ్‌కు చెందిన సరైన పత్రాలు లేని వలసదారులను గుర్తించే పేరుతో సాగించే ఈ ప్రక్రియ కనీస మానవ హక్కుల ఉల్లంఘనకు ఉదాహరణగా వుంది. ఈ క్రమంలో నిజమైన భారత పౌరులు వారి భాష, మతం ప్రాతిపదికన లక్ష్యాలుగా మారుతున్నారు. బెంగాలీ మాట్లాడడం భారతదేశంలో ఇప్పుడు నేరమా? పైగా బెంగాలీ మాట్లాడే ముస్లిం పౌరులందరినీ నేరస్తులుగా, అక్రమ వలసదారులుగా చూస్తారా? పశ్చిమ బెంగాల్‌లో 26శాతంమంది జనాభా బెంగాలీ మాట్లాడే ముస్లింలేనని ఈ సందర్భంగా గుర్తు చేయాలనుకుంటున్నామని బృందా కరత్, అనురాగ్ సక్సేనా ఆ లేఖలో పేర్కొన్నారు. పైగా, అక్రమ వలసదారులను తరలించేందుకు కూడా అంతర్జాతీయంగా కొన్ని నిబంధనలు, ప్రమాణాలు వుంటాయి. కానీ ఢిల్లీలో ప్రస్తుతం అనుసరిస్తున్న గుర్తింపు పద్ధతులు అటువంటి నిబంధనలన్నింటినీ ఉల్లంఘిస్తున్నాయి.

పైన పేర్కొన్న అంశాలన్నింటినీ పరిశీలించి, మానవ హక్కులను పునరుద్ధరించడానికి, అలాగే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల మానవీయ వైఖరిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నష్టపోయిన బాధితులకు తగిన రీతిలో నష్టపరిహారం చెల్లించాల్సిందిగా వారు ఆ లేఖలో హోం మంత్రి అమిత్ షాను కోరారు.

గందరగోళంగా ఓటర్ల జాబితా సవరణ



- రంగంలోకి రాజకీయ పార్టీలు
- భారీగా పెరిగిన బూత్ లెవెల్ ఏజెంట్లు

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)తో గందరగోళం విస్తరిస్తోంది. అవసరమైన పత్రాల కోసం ప్రజలు వెతుకులాట మొదలు పెడుతుండడంతో రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలో తమ ఉనికిని పెంచుకోవడం కోసం ఏజెంట్లను మోహరించడాన్ని పెంచుతున్నాయి. బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఎ)గా రాజకీయ పార్టీల కార్యకర్తలు నమోదు చేసుకోవడం పెరుగుతోంది. ఈ పరిస్థితి ప్రతిపక్ష పార్టీల మధ్య ఎక్కువగా కనిపిస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు లబ్ది చేకూరవచ్చని ఆ పార్టీలు ఆశిస్తున్నాయి.

జూన్ 25న ఎస్‌ఐఆర్ ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్రంలో పార్టీలవ్యాప్తంగా బిఎల్‌ఎల సంఖ్య 13శాతం పెరిగింది. 1,38,680 నుండి 1,56,625కి వీరి సంఖ్య పెరిగింది. రాజకీయ పార్టీలు ఈ బిఎల్‌ఎలను నామినేట్ చేస్తాయి. ఇందుకు సంబంధించి రిటర్నింగ్ ఆఫీసర్ లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు లాంఛనంగా ఒక దరఖాస్తును పార్టీలు అందజేస్తాయి. వారు పరిశీలించి ఆ పేర్లను ఆమోదిస్తారు. బిఎల్‌ఎలు వారికి అప్పగించిన పోలింగ్ ఏరియాలో నివాసితులు లేదా నమోదైన ఓటర్లు అయి వుండాలన్నది ప్రాథమిక నిబంధన.

ఇసి పంచుకున్న డేటా ప్రకారం ఎస్‌ఐఆర్ ప్రారంభమైన జూన్ 25 నుండి జులై 2 మధ్య కాలంలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ అదనంగా 17.51శాతం బిఎల్‌ఎలను మోహరించింది. వీరి సంఖ్య 56,038 నుండి 65,853కి పెరిగింది. ఇండియా బ్లాక్‌లో ప్రధాన పార్టీ అయిన ఆర్‌జెడి 0.77 శాతం బిఎల్‌లను మాత్రమే పెంచింది. దీంతో, 47,143 నుంచి 47,504కి స్వల్పంగా పెరిగింది. ఎన్‌డిఎ కూడా ఈ సంఖ్యను పెంచుకుంది. ఇండియా బ్లాక్‌తో పోలిస్తే కాస్తంత తక్కువగా 10.86శాతం పెరిగింది. అయినా మొత్తంగా వారి బిఎల్‌ఎల సంఖ్య ఇండియా బ్లాక్ కన్నా ఎక్కువగానే వుంది. 80,083 నుండి 88,781కి పెరిగింది.

11 పత్రాలు లేక నిరుపేదల్లో ఆందోళన

ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడం కోసం ఇసి రూపొందించిన 11 పత్రాల జాబితాలో చాలా పత్రాలు లేకపోవడంతో నిరుపేదలు, సమాజంలో వెనుకబాటుకు గురైన వారు (మైనారిటీలతో సహా) తీవ్రంగా దెబ్బతినే అవకాశం వుంది. ఓట్ల కోసం ప్రధానంగా ఈ గ్రూపులపై ఆధారపడిన కాంగ్రెస్ దాదాపుగా బిఎల్‌ఎల సంఖ్యను రెట్టింపు చేసుకుంది. 8,586 నుండి 16,500 వరకు బూత్ లెవల్ ఏజెంట్ల సంఖ్యను పెంచుకుంది. అంటే 92.17శాతం పెరుగుదల నమోదైంది. వామపక్షాలు కూడా గణనీయంగా బూత్ లెవల్ ఏజెంట్లను పెంచుకున్నాయి. సిపిఎం 76మంది వున్న ఏజెంట్లను 578కి పెంచుకుంది. అంటే 660.53శాతం పెంపుదల. సిపిఐ (ఎంఎల్-లిబరేషన్) 233 నుండి 1271కి పెంచుకుంది. అంటే 445.49శాతం మేర ఏజెంట్ల సంఖ్యను పెంచుకుంది. బిజెపి తన ఏజెంట్ల సంఖ్యను 51,964 నుండి 52,689కి పెంచుకుంది. ఎస్‌ఐఆర్ జులై 25వరకు కొనసాగనుంది. సరిగా సగం రోజులు పూర్తయ్యేసరికి అంటే జులై 9నాటికి ఓటర్లకు పంపిణీ చేసిన ఫారాలు 57.48శాతం మేర అందుకున్నామని ఇసి చెబుతోంది. జులై 25 నాటికి ఎవరైతే వారి ఫారాలను అందజేస్తారో వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో చేరుస్తామని, ఆగస్టు 1న ప్రచురిస్తామని ఇసి చెబుతోంది.



పాదయాత్ర చేస్తున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తదితరులు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

- పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి
- అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం అండతో అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ, కర్నూలు జిల్లాల్లో నిరసనలు తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను పూర్తిగా రద్దు చేయాలని, ఇళ్లకు బిగించిన మీటర్లను తొలగించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖ జివిఎంసి 63వ వార్డు పరిధి చింతల్లోవ, కాకరలోవలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదాని ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు, పెంచిన కరెంటు ఛార్జీలను రద్దు చేయకుంటే టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పని హెచ్చరించారు. పూర్ణా మార్కెట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కర్నూలు నగరంలోని కవాడి వీధి, చాకలిగేరీ, కడక్ పుర, ఎర్రబురుజు, 37వ వార్డులోని వీకర్ సెక్షన్ కాలనీలో, 33వ వార్డులోని కల్లూరులో స్మార్ట్‌మీటర్లపై పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ స్మార్ట్ మీటర్ల నష్టాన్ని వివరించారు. ఈ నెల 14న విద్యుత్ సౌధ వద్ద ధర్నాలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె, బైరాపురం గ్రామాలలో నిరసనలు తెలిపారు.

అమెరికాలో మళ్లీ ఉద్యోగుల కుదింపు

- 1300 మంది దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్ల తొలగింపు!

న్యూఢిల్లీ : అమెరికాలో ఉద్యోగుల కుదింపు ప్రక్రియ మళ్లీ మొదలైంది. తాజాగా విదేశాంగ శాఖలో చర్యలు చేపట్టిన ట్రంప్ యంత్రాంగం.. 1300 మంది ఉన్నతాధికారులను తొలగించేందుకు సిద్ధమైంది. ఈ జాబితాలో 1107 మంది సివిల్ సర్వెంట్లు, స్థానికంగా పనిచేస్తున్న 246 మంది దౌత్యవేత్తలు ఉన్నట్లు తెలిసింది. వీరికి లేఆఫ్ నోటీసుల జాడించాయి. నోటీసులు అందుకున్న దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు 120 రోజులపాటు సెలవుల్లో ఉంటారని, ఆ తర్వాత అధికారికంగా ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. అయితే, వీరిలో ఎక్కువ మందికి 60 రోజుల సమయమే ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దౌత్య ప్రాధాన్యాలపై దృష్టి పెట్టామని తాజా నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ప్రణాళికను ప్రస్తుత, మాజీ దౌత్యవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కేంద్రం ఆదేశానుసారమే...

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గూడ్స్ రేక్ పాయింట్ నుంచి రిటైల్ దుకాణాలకు ఎరువుల రవాణాకయ్యే ఖర్చును భరించాలంటూ కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారని తెలిపారు. కొత్తగా హిందూపూర్, అనకాపల్లి, మదనపల్లిలో రైల్వే రేక్ పాయింట్ల ఏర్పాటుకు సిఎం కేంద్రాన్ని అడిగారని, అనకాపల్లికి కేంద్రం అనుమతులు మంజూరు చేసిందని, తతిమ్మా రెండింటికీ త్వరలో అనుమతులు వస్తాయని పేర్కొన్నారు. ఎరువులను ఎంఆర్‌పికే అమ్మాలని, ఒక ఎరువు కోసం ఇంకొకటి కొనాలనే విధంగా లింక్‌లు పెట్టవద్దని ఆదేశించారు. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయని, ఎగువ ప్రాంతాల్లో వానలకు జలాశయాలు నిండాయని, కాల్వలకు నీరు విడుదల చేశారని, పంటల సేద్యానికి వాతావరణం అనుకూలంగా ఉందని, ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరగా ప్రభుత్వానికి సహకరిస్తామని కంపెనీలు, వ్యాపారుల ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ ఉన్నతాధికారులు వివి విజయలక్ష్మి, కృపదాస్, వెంకటేశ్వరరావు, కోరమండల్ సంస్థ జనరల్ మేనేజర్ సచ్చిదానందరెడ్డి, ఇంకా 14 కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేల్ వ్యాపారుల తరపున ఈకోట నానాజీ, రిటైలర్ల సంఘం నుంచి వివి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఐరాస ప్రత్యేక ప్రతినిధి అల్బనీస్‌పై అమెరికా ఆంక్షలు

- అంతర్జాతీయ జవాబుదారీ యంత్రాంగానికే ముప్పు
- ఖండించిన మానవ హక్కుల గ్రూపులు, నిపుణులు




న్యూయార్క్ : మానవ హక్కులపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై అమెరికా ఆంక్షలు విధించడాన్ని మానవ హక్కుల గ్రూపులు, ఐక్యరాజ్య సమితి అధికారులు తీవ్రంగా ఖండించారు. ఇలా ఐక్యరాజ్య సమితి నిపుణులను అమెరికా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అంతర్జాతీయ జవాబుదారీ యంత్రాంగాలకు ముప్పు ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయిల్‌లపై అల్బనీస్ రాజకీయ, ఆర్థిక యుద్ధ ప్రచారం జరుపుతున్నారని ఆరోపిస్తూ బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఈ ఆంక్షలను ప్రకటించారు.

ఇజ్రాయిల్ యుద్ధంతో 60కిపైగా కంపెనీలకు లాభాలన్న అల్బనీస్

గాజాలో ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లతో, మిలటరీ ఆపరేషన్లతో 60కిపైగా కంపెనీలు లాభాలను ఆర్జిస్తున్నాయని, అందులో అమెరికా కేంద్రంగా పనిచేసే లాక్‌హీడ్ మార్టిన్, మైక్రోసాఫ్ట్, కేటర్‌పిల్లర్ తదితరాలు వున్నాయని అల్బనీస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక నివేదికను వెలువరించారు. అది జరిగిన కొద్ది వారాలకే అమెరికా ఆంక్షలు విధించింది. తక్షణమే ఈ మారణకాండపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ జరపాలని ఆ నివేదిక పిలుపునిచ్చింది.

అల్బనీస్‌పై తక్షణమే ఆంక్షలు ఎత్తివేయాలి

అల్బనీస్‌పై తక్షణమే ఆంక్షలను ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ వోల్కర్ టుర్క్ డిమాండ్ చేశారు. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాల మధ్య తీవ్రమైన విభేదాలు, భిన్నాభిప్రాయాలు వున్నప్పటికీ చర్చలు, సంప్రదింపుల ప్రక్రియను అనుసరించాలని ఆయన కోరారు. శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడానికి బదులుగా అర్థవంతమైన చర్చలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఐక్యరాజ్య సమితిలో స్విట్జర్లాండ్ ప్రతినిధి, ప్రస్తుతం మానవ హక్కుల మండలి అధ్యక్షుడైన జుర్గ్‌లాబర్ మాట్లాడుతూ, అల్బనీస్‌పై ఆంక్షలు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బెదిరింపులు లేదా ప్రతీకార చర్యలకు దూరంగా వుండాలని సభ్య దేశాలను కోరారు. ఇటువంటి చర్యలు ప్రమాదకరమైన ప్రమాణాలను నెలకొల్పుతాయని ఐక్యరాజ్య సమితి నిపుణులు హెచ్చరించారు. రష్యా మానవ హక్కుల ప్రతినిధి మరియానా కజరొవా మాట్లాడుతూ అమెరికా చర్యతో ఇతర దేశాలు కూడా ఇలాగే వ్యవహరించడానికి వెసులుబాటు కల్పించినట్లవుతుందని అన్నారు. మొత్తంగా ఐక్యరాజ్య సమితి వ్యవస్థపైనే దాడి అని వ్యాఖ్యానించారు. మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ హెచ్‌ఆర్‌డబ్ల్యు కూడా ఇదే రీతిలో ఆందోళనలు వ్యక్తం చేసింది. సంస్థల నిబంధనలను, ప్రమాణాలను అమెరికా ధ్వంసం చేస్తోందని హెచ్‌ఆర్‌డబ్ల్యు ఇంటర్నేషనల్ జస్టిస్ డైరెక్టర్ లిజ్ ఎవిన్సన్ విమర్శించారు. ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై ఐసిసి ప్రాసిక్యూషన్లకు అడ్డుకునేందుకే ఈ ఆంక్షలని హెచ్‌ఆర్‌డబ్ల్యు మాజీ హెడ్ కెన్నెత్ రాథ్ అన్నారు.



అబెల్ అబల్లె డెస్పైగ్నేను సత్కరిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు కె బాలకృష్ణన్, వాసుకి, రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం తదితరులు

తమిళనాడులో క్యూబాకు సంఘీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడులో క్యూబా సంఘీభావం కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు క్యూబా రిపబ్లిక్ రాయబార కార్యాలయం 'ఛార్జ్ డి' వ్యవహారాల ప్రతినిధి అబెల్ అబల్లె డెస్పైగ్నే తమిళనాడులో రెండు రోజులపాటు పర్యటిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు కె బాలకృష్ణన్, యు వాసుకి, రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం, రాష్ట్ర నాయకులు, క్యూబా సాలిడారిటీ ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు ఆయనతో సమావేశమయ్యారు.

ట్రంప్ ప్రజల శత్రువు

- బ్రెజిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు
- అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మలు దహనం
- అధిక సంఖ్యలో పాల్గొన్న నిరసనకారులు

సావొలో : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న దారుణమైన టారిఫ్‌లకు వ్యతిరేకంగా బ్రెజిల్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. వేలాది మంది నిరసనకారులు వీధుల్లోకి చేరి పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. డోనాల్డ్ ట్రంప్ ప్రజల శత్రువు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పలుచోట్ల ఆయన దిష్టిబొమ్మలతో ర్యాలీలు జరిపి దహనం చేశారు. దక్షిణ అమెరికా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 50 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తర్వాత బ్రెజిల్‌లో ఈ ఆందోళనలు జరిగాయి.

పాలిస్టా అవెన్యూలో ఆందోళనకారులు ట్రంప్ దిష్టిబొమ్మతో ఊరేగింపు జరిపారు. ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సావో పాలోలో జరుగుతున్న ఆందోళనలో నిరసనకారులు అధిక సంఖ్యలో గుమిగూడారు. ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారోలోను పోలి ఉన్న ఫేస్ మాస్క్‌లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. సోషల్‌మీడియా మూవ్‌మెంట్స్, యూనియన్లు ఈ ఆందోళనను నిర్వహించాయి. న్యాయమైన ఆర్థిక విధానాలపై డిమాండ్ చేశాయి. ప్రజలను పణంగా పెట్టి, బిలియనీర్లను రక్షించటాన్ని ఖండించాయి. అయితే 2022 ఎన్నికల్లో ఓటమికి సంబంధించిన విషయంలో అభియోగాలు ఎదుర్కొంటున్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారో ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ట్రంప్ టారిఫ్ వార్‌కు తెరలేపారు.

గవర్నర్‌తో సిఎం చంద్రబాబు భేటీ

- తాజా రాజకీయ పరిణామాలపై గంటకు పైగా చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్‌తో సిఎం చంద్రబాబునాయుడు రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ భేటీ రాత్రి 7.08 గంటల నుంచి 8.14 నిమిషాల వరకు కొనసాగింది. విశ్వసనీయ సమాచారం మేరకు బనకచర్ల ప్రాజెక్టు డిజైనింగ్, డిపిఆర్, గోదావరి మిగులు జలాలు తెలంగాణకు నష్టం లేకుండా ప్రాజెక్టు రూపకల్పన గురించి ప్రధానంగా గవర్నర్‌కు సిఎం వివరించినట్లు తెలిసింది. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శల పేరుతో రాజకీయ పర్యటనల సందర్భంగా పోలీస్ అనుమతులను లెక్క చేయకుండా ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తుండటంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా వ్యవహరిస్తున్న విధానం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి గవర్నర్ దృష్టికి సిఎం తీసుకెళ్లినట్లు సమాచారం. అమరావతిలో రెండో దశ భూ సేకరణ, నెల్లూరు జిల్లా కరేడు, రామాయపట్నం ప్రాంతంలో భూ సేకరణ , ఎదురవుతున్న ఇబ్బందులు గురించి కూడా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈనెల 14నుంచి 16 వరకు ఢిల్లీ పర్యటనకు వెలుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితుల గురించి గవర్నర్‌కు సుదీర్ఘంగా వివరించినట్లు సమాచారం. ముఖ్యంగా రాష్ట్రంలో సంచలనంగా మారిన లిక్కర్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుందని, దర్యాప్తులో భాగంగా అప్పటి ఎక్సైజ్‌శాఖ ముఖ్య కమిషనరు, రిటైర్డ్ ఐఎఎస్ రజత్ భార్గవ శుక్రవారం సిట్ అధికారులు ముందు విచారణకు హాజరయ్యారని. ఈ కేసులో 5వ నిందితునిగా ఉన్న రాజ్యసభ మాజీ ఎంపి విజయసాయిరెడ్డి ఈనెల12న విజయవాడలో సిట్ దర్యాప్తుకు సాక్షి కింద హాజరవుతుండటంతో ఈ కేసు కీలకదశకు చేరుకుంటోందని, ఈ కేసులో కీలకనేతల అరెస్ట్‌లు కూడా ఉండే అవకాశం ఉందని గవర్నర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది.

కేంద్రం నుంచి ప్రతి పైసా రాబట్టాలి

- సొంత ఆదాయాన్ని పెంచుకోండి
- ఆదాయవనరులశాఖలపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి వివిధ పథకాలకు రావాల్సిన నిధుల్లో ప్రతిపైసాను రాబట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆదాయ వనరులశాఖల పనితీరుపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఆదాయంపై లీకేజిలను నివారించాలని, అన్ని శాఖలు సొంత ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. వాణిజ్య పన్నులశాఖ, అటవీ, అబ్కారీ, గనులు, రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖల్లో రావాల్సిన, వచ్చిన ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు.కేంద్రం నుంచి ఏ పథకానికి ఎంత రావాల్సి ఉంది, ఇప్పటివరకు ఎంతవచ్చింది అన్నది విశ్లేషించుకోవాలని, రావాల్సిన నిధులపై ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు చేయాలని ఆదేశించారు. మొత్తం కేటాయింపులు పూర్తిగా వచ్చేలా చూడాలన్నారు. సంక్షేమం, అభివృద్ధికి కావాల్సిన ఆదాయాన్ని సమకూర్చేందుకు అన్ని శాఖలు రెవెన్యూను పెంచాలని స్పష్టం చేశారు. 2019-24 మధ్య కాలంలో నిలిచిపోయిన ఉపాధిహామీ పనులను తిరిగి పునరుద్ధరించాలని, దీనివిలువ 180 కోట్ల రూపాయల వరకు ఉంటుందని చంద్రబాబు చెప్పారు. అలాగే 3.52 లక్షలకుపైగా పనులను తిరిగి ప్రారంభించేందుకు కేంద్రం కూడా అంగీకరించిందని చెప్పారు. త్వరలోనే గ్రామాల్లో నరేగా పనులను విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటూ గ్రామ సభల నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.


ఆ పిల్లలు భవిష్యత్‌కు ఆశాకిరణం

- మతపరమైన గుర్తింపు లేకుండా పాఠశాలల్లో చేరటం అభినందనీయం
- కేరళ హైకోర్టు జడ్జి వి.జి అరుణ్

తిరువనంతపురం : మతపరమైన గుర్తింపు లేకుండా స్కూళ్లలో చేరే చిన్నారులు భవిష్యత్‌కు ఆశాకిరణమని కేరళ హైకోర్టు జడ్జి వి.జి అరుణ్ అన్నారు. ఈ విషయంలో ముందుకొచ్చిన చిన్నారుల తల్లిదండ్రులను ఆయన అభినందించారు. హేతువాద సంస్థ కేరళ యుక్తివాది సంఘం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో పాల్గొన్న జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత వైశాఖన్‌ను సత్కరించారు. వైశాఖన్‌తో పాటు హేతువాది, రచయిత పావనన్‌లు దృఢ విశ్వాసం, అభిప్రాయం కలిగిన వ్యక్తులుగా జడ్జి అభినందించారు. "మతపరమైన గుర్తింపు లేకుండా మీ పిల్లలను చేర్పించకుండా సిద్ధంగా ఉన్న మిమ్మల్ని (తల్లిదండ్రులు) నేను అభినందిస్తున్నాను. ఇలా చేరిన చిన్నారులు భవిష్యత్‌కు ఆశాకిరణంగా ఉంటారు. సమాజంలో ప్రశ్నిస్తుంటారు" అని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా రచయితలపై జరుగుతున్న దాడులను కూడా ఆయన ప్రస్తావించారు. కొందరు రాబందుల్లా ఇలాంటి చర్యలకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా సోషల్ మీడియా పోస్టులతో సంబంధం ఉన్న పిటిషన్‌లను తాను హైకోర్టులో చూస్తున్నానని చెప్పారు.



ఒక్కటిగా కలిసుందాం!



ఒక రహదారి పక్కన రావి, వేప చెట్లు మొలిచాయి. అవి పక్కపక్కనే ఉండటంతో వాటి మధ్య అన్యోన్యత పెరిగింది. ఆ రెండు చెట్లూ తమ స్నేహానికి గుర్తుగా పెనవేసుకుని మహా వృక్షాలుగా ఎదిగాయి. భూమిలోని నీటిని సైతం సమానంగా వేర్లకు అందించేవి. బాటసారులు ఆ చెట్ల కింద సేద తీరేవారు. కొంతకాలానికి వాటి మధ్య ద్వేషం పెరిగింది. అసూయ ఏర్పడింది. చివరకు నీకంటే నేనే గొప్ప అనే స్థితికి ఆ వృక్షాలు వచ్చాయి. వేర్లకు నీటిని అందించటంలోనూ పోటీ పడేవి. రావి చెట్టుకు నీరు అందకుండా వేప వేర్ల సహాయంతో అధిక నీటిని తీసుకునేది. రావి కూడా వేప చెట్టుకు అందకుండా ఎక్కువ నీటిని పీల్చుకుని దాచుకునేది. ఇలా పరస్పరం ఆధిపత్యం ప్రదర్శిస్తుండేవి.

స్నేహంగా ఉన్న సమయంలో పెనవేసుకున్న రావి, వేప చెట్లు విడిపోవాలని విశ్వ ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. చివరకు అవి ఒకరంటే ఒకరు పడని స్థితికి చేరుకున్నాయి. ఎవరు గొప్పో తేల్చుకోవాలనుకున్నాయి. ఒకరోజు పొరుగూరు పోతున్న బాటసారులు చీకటి పడటంతో రావి, వేప చెట్ల కిందకు చేరారు. ఆ రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. చుట్టుపక్కల అనేక చెట్లు నేలకూలాయి. బాటసారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు.

ఉదయాన్నే వాన వెలిసింది. రావి, వేప చెట్లు తమలో ఎవరు గొప్పో బాటసారులను అడగాలనుకున్నాయి. ఇంతలో వారు మాట్లాడుకోవటం వినపడింది. 'రాత్రి వర్షం, ఈదురుగాలులకు రావి, వేప చెట్లు మన ప్రాణాలు కాపాడాయి. ఇవి లేకుంటే మన ప్రాణాలు పోయేవి. చుట్టుపక్కల చెట్లన్నీ కూలిపోయాయి. ఈ చెట్లు బలంగా కలిసి ఉండటం వల్ల మనల్ని రక్షించాయి. విడివిడిగా ఉంటే ఇవీ కూలిపోయేవి. అవి కలిసుండి మనల్ని రక్షించాయి. మనం కూడా రావి, వేప చెట్ల మాదిరిగా ఐకమత్యంగా కలిసుండాల'ని బాటసార్లు అనుకున్నారు. వాళ్ల మాటలకు రెండు చెట్లు సిగ్గుపడ్డాయి. గతంలో మాదిరిగా కలిసుండాలని నిర్ణయించుకున్నాయి.

- తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
ఖమ్మం, 94923 09100.

సరైన అక్షరాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన జంతువుల పేర్లను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఉన్న గళ్లల్లో రాయండి. క్లూ ఉంది చూడండి.





నేను గీసిన బొమ్మ



ఎం.డి జ్యోతిర్మయి,
10వ తరగతి,
టీసీజీహెచ్ స్కూల్,
పామిడి, అనంతపురం జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

విజ్ఞానం ఉన్నదని గర్వించడమంత అజ్ఞానం మరొకటి లేదు.

మీ కోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెబ్బలను పేస్టులా చేసి, స్పూన్ తేనెతో కలిపి రోజూ మూడుసార్లు పిల్లలకు తినిపిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా కోలుకుంటారు.



JEEVANA జీవన the family

అక్కడ బ్యాక్ బెంచ్ లేదు..!



బ్యాక్‌బెంచ్.. అనే పదం చాలామందికి ఎన్నో చేదు జ్ఞాపకాలని, మరెన్నో భావోద్వేగాలని జ్ఞప్తికి తెస్తుంది. తరగతి గది అనగానే బ్లాక్ బోర్డు, చాక్‌పీస్, డస్టర్‌తో పాటు ఫస్ట్ బెంచ్, బ్యాక్ బెంచ్ అన్న మాటలు కూడా గట్టిగా వినిపిస్తాయి. క్లాసు రూంలో పిల్లలను బాగా చదివేవారు, అల్లరి గ్యాంగ్‌గా నిర్ణయించేది ఈ బెంచీలే. కూర్చొన్న బెంచీని బట్టి ఆ విద్యార్థిపై ఒక అభిప్రాయం ఏర్పర్చుకునే పరిస్థితి ఉంది. అక్కడి నుండే ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాలి.. ఎవరిని వదిలి పెట్టేయాలి అన్న నిర్ధారణకి కూడా వచ్చేస్తారు. ఈ విధానంపైనే ఇటీవల కేరళకి చెందిన వినేష్ విశ్వనాథ్ 'స్థానార్థి శ్రీకుట్టన్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. మొదట థియేటర్‌లో విడుదలైన ఈ చిత్రం, కొన్ని రోజుల నుండి ఓటీటీలో ప్రసారమవుతోంది. ఈ చిత్రం ఇచ్చిన స్ఫూర్తితో కేరళ పాఠశాలల్లో ఓ గొప్ప మార్పుకి నాంది పలికారు. ఇప్పుడు అక్కడ ఒక్కో స్కూలు, బ్యాక్ బెంచ్ లేని తరగతి గదులను నిర్వహిస్తున్నాయి. ఈ బాటలో నడవాలని మరిన్ని పాఠశాలలు సిద్ధమవుతున్నాయి. సినిమా సమాజాన్ని ఎంతలా ప్రభావితం చేస్తుందో అనడానికి ఇదే తార్కాణం. 'తరగతి గది సమాజాన్ని ముందుకు నడిపించే వారధి' అన్న నిజాన్ని మరోసారి ఈ చిత్రం బహిర్గతం చేసింది.

ఈ మార్పును స్వీకరించిన పాఠశాలల్లో త్రిసూర్‌లోని ఆర్‌సిసి ఎల్‌పిఎస్ తూర్పు మాంగాడ్ స్కూలు, పాలక్కాడ్‌లోని తోలనూర్ జిహెచ్‌ఎస్‌ఎస్ స్కూలు, కొల్లంలోని ఆర్‌వివి హెచ్‌ఎస్‌ఎస్, వాలకోమ్ స్కూలు, కన్నూర్‌లోని పప్పినిస్సేరి వెస్ట్ ఎల్‌పి స్కూలు, కొల్లంలోని ఎన్‌ఎస్‌వి విహెచ్‌ఎస్‌ఎస్, వాలకోడ్, కన్నూర్‌లోని అండూర్ ఎఎల్‌పి స్కూలూ ఉన్నాయి. ఈ స్కూళ్లల్లో ఇప్పుడు బెంచీల వరుస మారింది. క్లాస్‌కి వచ్చిన పిల్లలు బ్యాక్ బెంచీలు లేని తరగతి గది చూసి ఆశ్చర్యంతో పాటు ఆనందపడిపోతున్నారు. అయితే, ఎక్కువమంది పిల్లలు ఉన్న తరగతి గదుల్లో చుట్టూరా బెంచీలు సర్దే అవకాశం ఉండదు. కానీ, బ్యాక్‌బెంచీ అనగానే తక్కువ స్థాయి అనే అభిప్రాయం మార్చటానికి ఇది ఒక మంచి కదలిక.

కథేంటంటే..

ఈ మార్పుకి కారణమైన ఈ చిత్ర కథని క్లుప్తంగా చూద్దాం.

కె.ఆర్ నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూలు, కారెట్టు, తిరువనంతపురం చిత్ర కథకి మూల వస్తువు. స్కూల్లోని 7సి సెక్షన్‌లో జరిగే కథే సినిమా. శ్రీకుట్టన్ అనే పిల్లోడు, అతని గ్యాంగ్ రోజూ స్కూలుకి ఆలస్యంగా వస్తుంటారు. వాళ్ల కోసం క్లాసు రూమ్‌లో బ్యాక్ బెంచ్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఇక ఈ పిల్లలపై క్లాసులో విద్యార్థులకి, టీచర్లకి ఒకటే అభిప్రాయం. అల్లరి గ్యాంగ్ అని వీళ్లని చాలా తక్కువగా చూస్తుంటారు. బాగా చదవరని, ఎందుకూ పనికిరారని వీరి చుట్టూ కొన్ని అదనపు గుర్తింపులు కూడా తగిలిస్తారు. సినిమా అంతా ఈ పిల్లలు, వీళ్లతో మిగతా పిల్లలు, టీచర్లు ప్రవర్తించే తీరుని చూపించారు.

ఆ సంఘటనలు చూస్తున్నప్పుడు నిజ జీవితంలో బ్యాక్ బెంచ్‌లో కూర్చొన్న ప్రతి ఒక్కరికీ గత జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. అక్కడక్కడ సినిమాలో హీరోయిజం, ఆకర్షణ లాంటివి చూపించినా అవేమీ సినిమాకున్న ప్రత్యేకతను పాడు చేయకుండా దర్శకుడు జాగ్రత్త పడ్డారు. ఎందుకూ పనికిరారని పట్టించుకోని ఈ పిల్లల గ్యాంగ్ లీడర్ శ్రీకుట్టన్ క్లాస్ లీడర్ ఎలక్షన్లలో పాల్గొనడం, ఫస్ట్ బెంచ్ విద్యార్థిపై పోటీ చేసి గెలవడం అనేది సినిమాలో చూపించారు. అయితే సినిమాని చూస్తున్న ప్రేక్షకులకి ఇది ఆ పిల్లల మధ్య లీడర్‌షిప్ కోసం జరిగే పోటీలా అనిపించదు. స్కూల్లో నిత్యం వివక్ష ఎదుర్కొనే పిల్లలు ఎలా తయారవుతారు? ఈ వివక్షకు కారణమైన నిర్మాణం, భవిష్యత్తులో ఆ పిల్లలని ఎలా తయారు చేస్తుంది? వాళ్లు బయటికి వెళ్లాక ఈ వివక్ష వారిపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? అన్న విషయాలు అంతర్లీనంగా ఇందులో కనిపిస్తాయి. దర్శకుడు చెప్పాలనుకున్నది కూడా అదే. మొదటిసారి థియేటర్‌లో విడుదలైనప్పుడు సినిమా అంతగా రాణించలేదు. ఎప్పుడైతే ఓటీటీలో స్ట్రీమింగ్ కావడం ప్రారంభమైందో అప్పటి నుండే దర్శకుడి ఆశయం నెరవేరింది. ఇది ఆయనకి మొదటి సినిమానే. అయినా ఎంతో పరిణతితో తను చెప్పాలనుకున్న విషయాన్ని సృజనాత్మకంగా తెరపై ఆవిష్కరించారు. సినిమా సమాజాన్ని బాగు చేయక్కర్లేదు.. ఆలోచించేలా చేస్తే చాలు అన్న విషయంలో సఫలమైన దర్శకుడి ప్రతిభని ఈ సందర్భంగా మెచ్చుకోవాల్సిందే..



చదువంటే అర్థం మారిపోయింది..

నేటి సమాజంలో చదువు ఎలా తయారయ్యిందో చూస్తున్నాం. ర్యాంకులు కొట్టే పిల్లలు ఒక సెక్షన్‌లో, తక్కువ ర్యాంకులు వచ్చే పిల్లలు మరో సెక్షన్‌లో కూర్చొపెట్టి, వేర్వేరు ఫ్యాకల్టీలతో చదువుచెప్పించే ధోరణి ఉంది. ఇక బెంచీల సంగతి సరేసరి.

1994లోనే అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మార్పు తేవాలని ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. పిల్లల తెలివితేటలు, ఆర్థికస్థితి, ప్రవర్తన ఆధారంగా వారిని కూర్చొబెట్టే స్థలంలో హెచ్చు తగ్గులు చేయరాదన్నది దాని సారాంశం. కానీ ఎక్కడా అది అమలవ్వలేదు.

ప్రతి స్కూల్లో బ్యాక్ బెంచ్ విద్యార్థి, గౌరవప్రదమైన విద్యార్థిగా చూడరు. ఈ వివక్ష ఆ పిల్లల పసిమనసులపై ఎంత ప్రభావం చూపిస్తుందో ఎవరికీ అర్థం కాదు. అది ఆ చిన్నారుల హృదయాలను ఎంతలా గాయం చేస్తుందో కూడా ఎవరికీ పట్టదు.

ఈ పరిస్థితిలో మార్పు రావాలనే విశ్వనాథ్ తపించారు. ఆయన రూపొందించిన ఈ చిత్రం సమాజాన్ని ఆలోచింపజేసేలా ఉంది. విద్యార్థి లోకాన్ని ఒత్తిడి లేని సమాజం వైపు నడిపించేలా ఉంది. మూఢత్వంతో కాక, అభ్యుదయం వైపు యువత నడిస్తే సమాజాన్ని ఎంతలా ప్రభావితం చేయొచ్చో విశ్వనాథ్ తన సినిమా ద్వారా చేసి చూపించారు.

క్లైమాక్స్ చూపించిన ప్రభావం

మేం చదువుకునేటప్పుడు సెమీ సర్కిల్‌లోనే కూర్చోనేవాళ్లం. అప్పట్లో స్కూల్లో బెంచీలు ఉన్నా, లేకపోయినా పిల్లలంతా ఒక్కటిగానే ఉండేవాళ్లం. ఆ విషయాన్ని నేను సినిమా క్లైమాక్స్ సీన్‌లో పెట్టాను. ఈ సీన్ ఇంత ప్రభావం చూపిస్తుందని, ఇన్ని పాఠశాలలకు చేరుకుంటుందని మేము అసలు ఊహించలేదు.

- వినేష్ విశ్వనాథ్.

పిల్లలు చాలా సంతోషంగా ఉన్నారు

మా క్లాసులో విద్యార్థులు ఈ మార్పుని బాగా ఆస్వాదిస్తున్నారు. పిల్లల మధ్య మంచి సంబంధాలు మెరుగుపడడానికి ఇది దోహదం చేస్తోంది. పిల్లలు ఒకరితో ఒకరు ముఖాముఖి సంభాషించుకోవడం, ఉపాధ్యాయుడితో వ్యక్తిగత సంభాషణ పెరగడం ఇప్పుడు బాగా పెరిగింది.

- ఉన్నత పాఠశాల యాజమాన్యం, పరిప్పు.

బ్యాక్ బెంచ్, ఫస్ట్ బెంచ్ ఇక లేదు

ఇక క్లాసు రూమ్‌లో బ్యాక్ బెంచ్, ఫస్ట్ బెంచ్‌కి ఆస్కారం లేదు. పిల్లలను సమానంగా నేర్చుకునేలా చేద్దాం.

- జోసెఫ్ కాన్వెంట్ స్కూలు, బర్నాల (విశ్వనాథ్ ఇన్‌స్టా ఖాతాకి వాయిస్ మెసేజ్ పంపారు)

'అందరూ ఒకటే' అనే అర్థం వచ్చేలా ...

సినిమాలో చూపించిన చివరి సీన్ (పిల్లలందరూ సెమీ సర్కిల్ ఆకారంలో టీచర్ చుట్టూ కూర్చొని వుంటారు) 'క్లాసు రూంలో పిల్లలు అందరూ సమానమే' అన్న సందేశాన్ని ఇచ్చింది. ఇది మాకు ఎంతో నచ్చింది.

- సెయింట్ జార్జ్ చర్చి, తూర్పు మాంగాడ్.

13 ఎకరాల్లో 'అల్లు అర్జున్' మల్టీప్లెక్స్

విశాఖపట్నంలోని ఇనార్బిట్ మాల్ (ఎఎఎ) నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2023లోనే 13 ఎకరాల్లో విశాలంగా ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి పునాది పడింది. దక్షిణాదిలోనే విశాఖలో నిర్మించే మాల్ అతి పెద్దదిగా చెబుతున్నారు. ఆసియన్ సునీల్, అల్లు అరవింద్‌లతో పాటు వారి బృందం గురువారం నిర్మాణ పనులను పర్యవేక్షించింది. ఇప్పటికే థియేటర్‌లో ఉండాల్సిన ఇంటీరియర్ డిజైనర్లను అల్లు అర్జున్ ఫైనల్ చేశారు. మల్టీప్లెక్స్‌కు కావాల్సిన ఫర్నీచర్ అంతా విదేశాల నుంచే తెప్పిస్తున్నారు. విశాఖలోనే అత్యంత లగ్జరీ థియేటర్‌గా (ఎఎఎ) ఉండాలని వారు ప్లాన్ చేస్తున్నారు. మొత్తం 8 స్క్రీన్స్ ఈ మల్టీప్లెక్స్‌లో ఉంటాయనీ, 2026 వేసవిలో ఇది ప్రారంభం కానుందని అల్లు అరవింద్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అల్లు అర్జున్‌కు ఒక మల్టీప్లెక్స్ ఉంది. కోకాపేట వద్ద మరొకటి నిర్మించే ప్లాన్‌లో ఉన్నారు.





'కేడీ ది డెవిల్' టీజర్ విడుదల

కన్నడ నటుడు ధృవ సర్జా కథానాయకుడిగా వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న చిత్రం 'కేడీ ది డెవిల్'. దీనిని టీజర్ విడుదల వేడుక శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ధృవ సర్జా, రీష్మా నానయ్య, కీలకపాత్రలు పోషించిన సంజయ్‌దత్, శిల్పాశెట్టి హాజరయ్యారు. సంజయ్‌దత్ మాట్లాడుతూ, కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకీ, సుప్రీత్ ఈ సినిమాను బాగా నిర్మిస్తున్నారన్నారు. శిల్పా శెట్టి మాట్లాడుతూ, ముంబైలో విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇది ట్రెండ్ అవుతోందని అన్నారు. హైదరాబాద్ తర్వాత కొచ్చి, బెంగళూరు, చెన్నైలో ఈవెంట్స్ చేయబోతున్నట్టు కేవీఎన్ ప్రొడక్షన్ బిజినెస్ హెడ్ సుప్రీత్ తెలిపారు.

'దఢక్ 2' ట్రైలర్ విడుదల



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా పరిచయమైన 'దఢక్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. తాజాగా ఈ చిత్రం నుండి ట్రైలర్ రిలీజ్ చేశారు. మరాఠీలో వచ్చిన 'సైరాత్' సినిమాని హిందీలో 'దఢక్' పేరుతో రీమేక్ చేశారు. వేర్వేరు కులాలకు చెందిన అబ్బాయి, అమ్మాయి ప్రేమలో పడతారు. తర్వాత వీళ్లిద్దరూ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారనేదే కథ. ఇప్పుడు దీనికి సీక్వెల్ 'దఢక్ 2' తీశారు. ఆగస్టు 1న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. తమిళంలో 2018లో 'పరియరుమ్ పెరుమాళ్' అనే మూవీకి రీమేక్‌గా ఈ చిత్రం వస్తోంది. సిద్ధాంత్ చతుర్వేది తక్కువ కులానికి చెందిన కుర్రాడిగా, 'యానిమల్' ఫేమ్ తృప్తి దిమ్రి పై కులానికి చెందిన అమ్మాయిగా నటించారు.


25న 'సన్ ఆఫ్ సర్దార్ 2'



బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్ 2'. విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకుర్ కథానాయికగా నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన 'మర్యాద రామన్న' సినిమాను హిందీలో 'సన్ ఆఫ్ సర్దార్'గా రీమేక్ చేశారు. ఇప్పుడు ఇదే సినిమాకు 'సన్ ఆఫ్ సర్దార్ 2' అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి ట్రైలర్‌ను విడుదల చేశారు. అనుకోకుండా స్కాట్లాండ్ వెళ్లిన జస్సీ సర్దార్ అక్కడ ఎలాంటి సమస్యల్లో పడ్డాడనేది ఈ మూవీ కథ. ఈ సినిమాను జులై 25న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

నిర్మాతగా వడ్డే నవీన్

ఒకప్పటి హీరో వడ్డే నవీన్ ఇప్పుడు నిర్మాతగా మారబోతున్నారు. 'వడ్డే క్రియేషన్స్' పేరుతో ఆయన సొంత నిర్మాణ సంస్థ ప్రారంభించారని తెలుస్తోంది. దశాబ్దంపాటు హిట్ సినిమాల నటుడిగా తెలుగు ప్రేక్షకులని అలరించిన ఆయన తెలుగులో 28 చిత్రాలు చేశారు. 2016లో 'ఎటాక్' అనే చిత్రం ఆయన కెరీర్‌లో చివరి సినిమా. కొంతకాలంగా నవీన్ తన సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఆయన నిర్మాతగా రాబోతున్నారని సమాచారం.





మళ్లీ వాళ్లిద్దరే..

వింబుల్డన్ ఫైనల్‌కు సినర్, అల్కరాజ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సినర్, 2వ సీడ్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ 6-4, 5-7, 6-3, 7-6(8-6)తో 5వ సీడ్, అమెరికాకు చెందిన టేలర్ ఫ్రిట్జ్‌ను చిత్తుచేశాడు. రెండో సెమీస్‌లో సినర్ 6-3, 6-3, 6-4తో 6వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో ఆడిన వీరిద్దరి మధ్యే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు కూడా జరగనుంది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్కరాజ్ ఐదుసెట్ల హోరాహోరీ పోరులో సినర్‌ను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన తొలి సెమీస్ తొలి సెట్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాయంతో 6-4తో చేజిక్కించుకున్న అల్కరాజ్.. రెండో సెట్‌ను అనూహ్యంగా కోల్పోవాల్సి వచ్చింది. చివరి సెట్ టై బ్రేక్‌లోనూ ఫ్రిట్జ్ అంచనాలకు మించి రాణించాడు. కానీ అల్కరాజ్ తన పూర్వ వైభవాన్ని ప్రదర్శిస్తూ.. ఆ సెట్‌ను 8-6తో కైవసం చేసుకొని ఫైనల్లోకి దూసుకెళ్లాడు.



నేడు మహిళల సింగిల్స్ టైటిల్ పోరు

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో శనివారం మహిళల సింగిల్స్ టైటిల్ పోరు జరగనుంది. 13వ సీడ్, అమెరికాకు చెందిన అనిసిమోవా, 8వ సీడ్ స్వైటెక్(పోలండ్)ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీస్‌లో అనిసిమోవా టాప్‌సీడ్ అర్యానా సబలెంకను చిత్తుచేయగా.. స్వైటెక్ అన్‌సీడెడ్ క్రీడాకారిణి బెన్సిక్(స్విట్జర్లాండ్)ను ఓడించారు.

సుమిత్, ప్రీతికి స్వర్ణాలు

7వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



బెంగళూరు: 7వ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సుమిత్ అంటిల్, ప్రీతిపాల్ స్వర్ణ పతకాలను చేజిక్కించుకున్నారు. శ్రీకంఠీరవ స్టేడియంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఓపెన్ పారా అథ్లెటిక్స్‌లో రెండుసార్లు పారా ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన సుమిత్ అంటిల్ పురుషుల జావెలిన్ త్రో(ఎఫ్-12, ఎఫ్-16)విభాగంలో 72.25మీ. విసిరి పసిడి ఒడిసి పట్టాడు. మంజీత్ 54.56 మీ. రజతం ప్రదీప్ కుమార్ కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల 100మీ. (టి35, టి37, టి42) విభాగం పరుగులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రీతిపాల్ అగ్రస్థానంలో నిలిచింది. గుజరాత్‌కు చెందిన మోర్టీయ్ 17.20 సెకన్లలో గమ్యానికి చేరి రజత పతకానికి పరిమితం కాగా.. ఆమెకంటే 0.15సెకన్లతో ప్రీతి బంగారు పతకం కైవసం చేసుకుంది. హర్యానాకు చెందిన అవని 20.40సెకన్లు మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకానికి పరిమితమైంది.

బుమ్.. బుమ్.. బుమ్రా

- టెస్టుల్లో 13వ సారి ఐదు వికెట్లతో కపిల్ రికార్డు బ్రేక్
- ఇంగ్లండ్ 387ఆలౌట్
- ఇండియా 145/3

లండన్: లార్డ్స్ టెస్టులో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా రెండోరోజు విజృంభించాడు. తొలిరోజు కేవలం ఒక వికెట్ మాత్రమే తీసిన బుమ్రా.. రెండోరోజు ఏకంగా నాలుగు వికెట్లను పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా(5/74), సిరాజ్(2/85), నితీశ్‌రెడ్డి (2/62) సమిష్టిగా చెలరేగడంతో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌటైంది. శుక్రవారం ఆట ప్రారంభమైన తొలి సెషన్‌లోనే భారత బౌలర్లు మూడు వికెట్లు తీసి పట్టు సాధించేలా కనిపించారు. ఆ సమయానికి ఇంగ్లండ్ జట్టు 7వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రాండన్ కార్సే(56), వికెట్ కీపర్ జేమీ స్మిత్(51)ల అసమాన పోరాటంతో స్టోక్స్ సేన కోలుకుంది. వీళ్లిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 84 పరుగుల కీలక భాగస్వామ్యంతో భారీ స్కోర్ అందించారు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచిన కార్సే.. సిరాజ్ సంధించిన స్లో బాల్‌కు బౌల్డ్ కావడంతో 387 పరుగుల వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 251 పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ బెన్ స్టోక్స్(44) వికెట్‌ను జస్ప్రీత్ బుమ్రా తీసి వికెట్ల వేటను మొదలుపెట్టాడు. ఆ తర్వాత సెంచరీ పూర్తి చేసుకున్న జో రూట్(114)ను బుమ్రా బౌల్డ్ చేసి ఆతిథ్య జట్టు నడ్డివిరిచాడు. ఏడు వికెట్ల పడి ఆలౌట్ అంచున నిలిచిన ఇంగ్లండ్‌ను వికెట్ కీపర్ జేమీ స్మిత్ (51) మరోసారి ఆదుకున్నాడు. 5 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కేఎల్ రాహుల్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన స్మిత్.. అర్ధ శతకంతో ఆదుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారతజట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి 3వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. జైస్వాల్(13), కరణ్ నాయర్(40), గిల్(16) ఔట్ కాగా.. పంత్(19), కెఎల్ రాహుల్(53) క్రీజ్‌లో ఉన్నారు.



టెస్టుల్లో అత్యధిక సెంచరీలు కొట్టిన బ్యాటర్లు..

51	సచిన్ టెండూల్కర్(భారత్)
45	జాక్వెస్ కల్లీస్(దక్షిణాఫ్రికా)
41	రికీ పాంటింగ్(ఆస్ట్రేలియా)
38	కుమార సంగక్కర(శ్రీలంక)
37	జో రూట్(ఇంగ్లండ్)

కపిల్ రికార్డు బుమ్రా బ్రేక్..

టెస్టుల్లో క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ పేర ఉన్న ఒక రికార్డును జస్ప్రీత్ బుమ్రా బ్రేక్ చేశాడు. లార్డ్స్ టెస్ట్‌లో ఐదు వికెట్లతో సత్తా చాటిన బుమ్రా కెరీర్‌లో 13వ సారి ఈ ఫీట్‌ను అందుకున్నాడు. కేవలం 33 టెస్టుల్లోనే బుమ్రా ఐదు వికెట్లు చొప్పున పడగొట్టాడు. దీంతో కపిల్ దేవ్(66టెస్టుల్లో) 12సార్లు 5వికెట్లు పడగొట్టిన రికార్డును బుమ్రా బ్రేక్ చేశాడు. తొలిరోజు ఒక్క వికెట మాత్రమే సాధించిన బుమ్రా.. రెండోరోజు కొత్త బంతితో చెలరేగాడు. తొలి సెషన్ ప్రారంభంలోనే స్టోక్స్, రూట్, వోక్స్ వికెట్లను, రెండో సెషన్‌లో ఆర్చర్ వికెట్ పడగొట్టి ఈ ఫీట్‌ను అందుకున్నాడు.

రూట్ సెంచరీ..

రెండో రోజు ఆటలో భాగంగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ (104) సెంచరీతో రాణించాడు. లార్డ్స్ టెస్ట్‌లో తొలిరోజు ఆట ముగిసే సరికి 99పరుగులతో ఉన్న రూట్.. రెండోరోజు బుమ్రా వేసిన తొలి ఓవర్‌లోనే ఫోర్ కొట్టి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో టెస్టుల్లో రూట్ 37వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రాహుల్ ద్రావిడ్(భారత్), స్టీవ్ స్మిత్(ఆస్ట్రేలియా)లను అధిగమించాడు.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)పంత్ (బి)నితీశ్ రెడ్డి 18, డకెట్ (సి)పంత్ (బి)నితీశ్ రెడ్డి 23, పోప్ (సి) సబ్ ధృవ్ జురెల్ (బి)జడేజా 44, రూట్ (బి) బుమ్రా 99, బ్రూక్ (బి)బుమ్రా 104, స్టోక్స్ (బి)బుమ్రా 44, జేమీ స్మిత్ (సి)ధృవ్ జురెల్ (బి)సిరాజ్ 51, వోక్స్ (సి)ధృవ్ జురెల్ (బి)బుమ్రా 0, కర్సే (బి)సిరాజ్ 56, ఆర్చర్ (బి)బుమ్రా 4, బషీర్ (నాటౌట్) 1, అదనం 31. **వికెట్ల పతనం:** 1/43, 2/44, 3/153, 4/172, 5/260, 6/271, 7/271, 8/355, 9/370, 10/387 **బౌలింగ్:** బుమ్రా 27-5-74-5, ఆకాశ్ 23-3-92-0, సిరాజ్ 23.3-6-85-2, నితీశ్ 17-0-62-2, జడేజా 12-1-29-1, సుందర్ 10-1-21-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68